

MVS
PUBLICATIONS
మధుబాబు

# టెర్రర్ ఐలండ్

"మధూ! అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వుపయోగించాలని అభిలషించి అనేక రకాల పథకాలను చేపట్టింది భారత ప్రభుత్వం దేశం నలుమూలలావున్న మన సైంటిస్టులనందర్నీ ఒకచోట చేర్చి పెద్ద ఎత్తున పరిశోధనలు చేయిస్తున్నది. వారి పరిశోధనలు దిగ్విజయంగా ముగిసిన మరుక్షణం మన దేశం అణు విజ్ఞానంలో అందరికంటే రెండు మెట్లు పైకి చేరుకుంటుంది!"

"మనం, మన దేశం అంటే గిట్టని మన యిరుగు పొరుగు రాజ్యాధినేతలు యీ పరిశోధనలకు అంతరాయం కల్పించాలని శతవిధాల ప్రయత్నించారు. మన సి.ఐ.డిల నేర్పరితనం వల్ల విదేశీ గూఢచారుల ప్రయత్నాలు విఫలం అయ్యాయి."

"ఇంకో రెండు మాసాలలో మన సైంటిస్టుల పరిశోధనలు ముగియబోతున్నాయి. వెంటనే అనుకున్న పథకాలను ఆచరణలో పెట్టాలని ఆకాంక్షిస్తున్న మన నాయకులకుయిప్పుడు మరొక కొత్త సమస్య ఎదురగుగా వచ్చి నిలబడింది. శాంతియుత ప్రయోజనాలకు వుద్దేశించబడిన మన శాస్త్రజ్ఞుల పరిశోధనా ఫలితాలు _ రివర్స్ చేయబడితే భయంకరమైన అణ్వాయుధాలుగా తయారౌతాయి. ఇంతవరకూ ప్రపంచంలో ఎవరూ అటువంటి ఆయుధాలను నిర్మించలేదు. ఇంకో పాతిక సంవత్సరాలదాకా అటువంటి ప్రజ్ఞాపాటవాలను సంపాదించుకోలేరు."

"అందువల్ల యీ పరిశోధనా ఫలితాలను, ఫార్ములాలను అతి రహస్యంగా వుంచాలని నిర్ణయించారు మన నాయకులు మధూ! ఆ నిర్ణయం తీసుకోబడిన మరుసటి రోజునే పాకిస్థాన్ పాలకులు అణ్వాయుధాలు నిర్మించటానికి తలబడినట్లు మనకు వార్తలు వచ్చాయి."

"మన సి.ఐ.డిలు కొంత మంది ఆ వివరాలను సేకరించుకువచ్చారు. పాకిస్థాన్ పాలకులు అణ్వాయుధాలు నిర్మించటానికి ఉపయోగించే ఫార్ములాలు మనకు అందాయి మధూ! మన శాస్త్రజ్ఞులు తయారుచేసిన ఫార్ములానే రివర్స్ చేశారు వారు. అంటే మన రహస్యాలు వారికి తెలుస్తున్నాయి. చీమకూడా లోనికి పోవటానికి వీలులేనంత కట్టుదిట్టమైన కాపలావున్న మన రీసెర్చి లేబరేటరీలలోని విషయాలు బయటికి వెళుతున్నాయి."

"మధూ! యీ విషయం చదివి... నువ్వు అనేక రకాల అనుమానాలకుగరి అవుతున్నావని నాకు తెలుసు. ఎన్నో పరిశోధనలు జరిగాయి. మన సైంటిస్టులలో దేశద్రోహులు లేరు. లేబరేటరీలలోని శత్రువులు ప్రవేశించి మన పరిశోధనా ఫలితాలను తస్కరించే అవకాశంలేదు. అయినా... ఏ రోజు విషయాలు ఆ రోజునే పాకిస్థాన్ పాలకులకు చేరుతున్నాయి ఎలా?"

"మన సి.ఐ.బి. కే కొరుకుడు పడని సమస్యగా తయారయింది యిది. ఈ సమస్యను పరిష్కరించగల శక్తి నీకు ఒక్కడికే వుంది ఇటువంటి పనులు చేయటం నీకు యిష్టం లేదని నాకు తెలుసు. తప్పదు మధూ! ఇది మన దేశశాంతి భద్రతలకు సంబంధించిన విషయమేకాదు నా పరువు... మన సి.ఐ.బి పేరు... ఆఖరికి నీ స్నేహితుడు షాడో ప్రతిష్ట అన్నీ కలిసి మట్టిలో పోరలాడే సమయం

ఏతెంచింది. నువ్వు తప్ప మరో వ్యక్తి ఈ సమయంలో మాకు సాయపడలేరు. బాగా ఆలోచించుకొని వెంటనే నీ అంగీకారం తెలియచేస్తావని ఆశిస్తున్నాను _ కులకర్ణి''

ఉత్తరం చదవటం పూర్తి అయింది. నాకు తెలియకుండానే చేతిలోనించి జారి క్రిందపడిపోయింది కాగితం.

ఏదో తెలియని చల్లటి మంచు హస్తమొకటి నా గుండెలను పట్టుకొని పిండుతున్నట్లు అనుభూతి కలిగింది. వళ్ళు గగుర్పొడిచింది. ముఖమంతా స్వేద బిందువులతో నిండిపోయింది. గొంతు తడి ఆరిపోయింది. పెదిమలు ఎండి నాలుక పిడచగట్టుకు పోయింది.

‘‘సార్? ఈ లెటర్ మీదేనా?'' అంటూ కింద పడిన కాగితాన్ని తీసి నా ముందు పెట్టాడు ముత్తు.

ఆ మాటతో నాకు తెలివి వచ్చింది. తడబాటును కప్పిపుచ్చుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేస్తూ, లెటర్‌ని జేబులో పెట్టుకున్నాను.

అయినా ముత్తు కనిపెట్టేశాడు. ‘‘ఏమి సార్, అలా వున్నారు?'' అన్నాడు పట్టి పట్టి చూస్తూ.

‘‘ఏమీ లేదులే...'' అంటూ గబగబా బయటికి వచ్చేశానుగాని ఎలా వున్నానో నాకు తెలుసు. పాతిక రోజులు మలేరియాతో బాధపడిన పేషెంట్లు జ్వరం తగ్గి మరుసటి రోజుఎలా వుంటారో_ అలా వుండి వుంటాను.

పాదాలు అప్రయత్నంగా ముందుకు కదులుతున్నాయి. నా మనస్సు అర్థంలేని ఆలోచనలతో సతమతం అవుతున్నది.

కులకర్ణిగారి భావం నాకు కొట్టవచ్చినట్లు కనిపిస్తూనే వుంది. "మధూ... మరెప్పుడూ ఇటువంటి పనులు చేయమని నిన్ను బలవంతపెట్టను. ఇందులోని కష్టసుఖాలు నాకు బాగా అర్థం అయ్యాయి." అన్నారాయన ఒకసారి. అది మూడు సంవత్సరాల క్రితం.

వరస చూస్తుంటే... ఆ కష్టఖాల సంగతి మర్చిపోయినట్టుంది. ఏమాత్రం జ్ఞాపకమున్నా... ఈ లెటర్ వ్రాసివుండరు.

ఆయన వ్రాసిన విషయాలన్నీ నా అంతరంగంలో మరోసారి మెదిలాయి. నిజమే! ఎంతో అవసరం అనుకుంటే తప్ప కులకర్ణిగారు నన్ను కాంటాక్టు చేయరు. బాగానే వుంది కాని... ఈ వ్యవహారంలో తలదూర్చి నేను ప్రాణాలతో బయటపడగలనా?

ఊరికే కూర్చోలేక సరదాగా ఎక్స్‌పెరిమెంట్ చేశాను మూడు సంవత్సరాల క్రితం. అప్పుడు కులకర్ణిగారు నా పక్కనే వున్నారు. సరదాగా మెదలుపెట్టిన వ్యవహారం మా యిద్దరినీ పిచ్చివాళ్ళను చేసే స్టేజికి చేరుకున్నది. ఆ పరిస్థితినుంచి బయటపడేసరికి... నిజంగానే పిచ్చి ఎక్కినంత పని అయింది మా యిద్దరికీ.

ఆ సంఘటనలను తలుచుకునేసరికి నా శరీరం మరింతగా జలదరించింది. ఎక్కడాలేని నీరసమంతా వచ్చి నన్ను ఆవరించుకున్నది.

నడిచే ఓపిక లేక టాక్సీలో నా గదికి చేరుకున్నాను.

ఎంత ప్రయత్నించినా... ఎంత మరిచి పోదామనుకున్నా కులకర్ణిగారి జాబు నా మనఃపథం నుంచి మాయం కావటంలేదు. ఎంత భయంగా వున్నా...

ఆయన కోరికను అంగీకరించాలనే నిర్ణయం నెమ్మదిగా నా హృదయంలో చోటు చేసుకోవటం ప్రారంభించింది.

టీపాయ్ మీద వున్న ఫోన్ అందుకొని మూడు జీరోలకు రింగ్ చేసాను. "హల్లో వాట్ కెనై డూ ఫర్ యూ!" అంటూ వినిపించింది ఒక మృదు మధుర కంఠం.

"కనెక్టు మీ టు డబుల్ జీరో" అన్నాను.

మరునిముషంలో మరో అందమైన కంఠం నన్ను గ్రీట్ చేసింది. సి.ఐ.బి. రిసెప్షనిస్టు బెట్టీ కంఠం అది. నాకు తెలుసు.

"బెట్టీ... మద్రాసునుంచి మాధవ్ రింగ్ చేశాడని బాస్‌కి చెప్పు. రేపు ఉదయం బయలుదేరి ఢిల్లీ వస్తున్నాను." అని చెప్పి వెంటనే డిస్కనెక్టు చేశాను.

సరిగ్గా సాయంత్రం నాలుగు గంటలు అయింది సమయం. చీకటి పడటానికి మరో రెండు గంటలు మాత్రమే వ్యవధి వుంది.

టీపాయ్‌ని గోడకు ఆనించి నేలమీద వున్న కార్పెట్‌ని చుట్ట చుట్టి అవతల పడేశాను. బకెట్‌తో నీరు తెచ్చి గదినంతా శుభ్రంగా కడిగి... చెమ్మ లేకుండా నీట్‌గా తుడిచాను.

తలారా స్నానం చేసి, ఎర్రటి పట్టు ధోవతిని కట్టుకొని, కావల్సిన సామానులకు గది మధ్యకు చేర్చాను.

సూర్యుడు అస్తమించాడు. సంధ్య చీకట్లు జగతిని చుట్టు ముట్టటం ప్రారంభించాయి.

పాలరాతిలా తళ తళా మెరుస్తున్న గచ్చుమీద స్కేలుతో కొలిచి ఏడు అడుగుల వ్యాసంలో పెద్ద వృత్తాన్ని గీచాను. వృత్తానికి ఆరు పక్కల ఆరు నక్షత్రాలను చిత్రీకరించాను.

ఆరు నక్షత్రాలనూ పసుపు కుంకుమలతో అలరించి ఒక్కొక్కదానిలో ఒక్కొక్క ప్రమిదెను ప్రతిష్టించాను. నక్షత్రానికి నక్షత్రానికి మధ్య ఒక నిమ్మపండును నిలబెట్టాను.

పూర్తిగా చీకటి పడింది. దట్టమయిన మామిడితోపులో వుంది నా గది. అందువల్ల కన్నుపొడుచుకున్నా కానరాని అంధకారం నా గదిని ఆవరించుకున్నది. ఆ అంధకారంలో... నేను ప్రతిష్టించిన జ్యోతిర్మయ చక్రం... వింతగా కనిపించటం ప్రారంభించింది. గాలి వీచినప్పుడల్లా... జ్యోతులు... అటూ ఇటూ చలిస్తున్నాయి. అది చలించి నప్పుడల్లా నా గుండె వీరంగం మోతలు వినిపిస్తున్నది.

సాధారణమయిన గాలికి అవి ఆరిపోవని నాకు తెలుసు. కాని... నేను ఆ జ్యోతిర్మయ చక్రంలో వుండగా ఆరిపోయాయంటే _ వాటితోపాటు నా జీవనజ్యోతి కూడా ఆరిపోతుంది.

చుట్టూ చూశాను. ఎక్కడ వుండాల్సిన వస్తువులు అక్కడే వున్నాయి. ఫోన్ చక్కగా వున్న టైం పీస్ ఏడుగంటలను సూచిస్తోంది.

నేను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకొని సిద్ధపడేసరికి ఎనిమిదిన్నర అవుతుంది. పగలంతా కష్టించి పనిచేసేవారు పక్కల మీదికి చేరుకునే వేళ అది.

ఎనిమిదిన్నర తరువాత నన్ను ఎవరూ డిస్టర్బ్ చేయకూడదు. చేస్తే కొంపలు మునిగిపోవుగాని పడిన కష్టం వృథా అవుతుంది.

ఆ మాట అనుకుంటుండగానే ఫోన్ గంయ్ మంటూ మోతలు చేసింది. విసుగ్గావెళ్ళి రిసీవర్ ని అందుకున్నాను.

"మధూ... పారగన్‌లో నీ ఫేవరెట్ పిక్చర్ "టెక్సాస్ ఎక్రాస్ ది రివర్" వచ్చింది. సెకండ్ షోకి వస్తావా?" వినిపించింది చెల్వి కంఠం.

ఏమని సమాధానం చెప్పాలో నాకు ఒక పట్టాన అర్థం గాలేదు. రాను అన్నానంటే పది నిముషాల్లో గదికి వచ్చేస్తుంది. అసలు విషయం చెపితే యిక నాకు మద్రాసులో మంచి నీళ్ళుకూడా పుట్టవు.

ఎమ్.బి.బి.యస్. నాలుగో సంవత్సరపు చదువులో వుంది చెల్వి. ఆమె ఫాదర్ పెద్ద పారిశ్రామికవేత్త కోటీశ్వరుడు. ఆ కోట్లకు చెల్వి ఏకైక వారసురాలు.

నేను వ్రాసిన నవలలు, చెత్తా చెదారం అవీ ఇవీ అన్నీ చదివి నేనంటే ఒక విధమైన ఆకర్షణ ఏర్పరుచుకున్నది. మా మధ్య అరమరికలు ఏవీ లేవుకాని యిటువంటి సంబంధ బాంధవ్యాలు వివాహంతో ముగిస్తేనే బాగుంటుంది. చెల్వి చిటికెన వేలికి వుండే వజ్రపుటుంగరం విలువచేయను నేను. యిక వివాహం అనే అక్షరాలను కలలోనైనా ఉచ్చరించే అర్హత ఎక్కడినుంచి వస్తుంది?

"ఏమిటి మధూ! మళ్ళీ ఏదైనా నావెల్ స్టార్ట్ చేశావా?" అంటూ నా ఆలోచనలకు అంతరాయం కలిగించింది ఆమె.

నాప్రాణం లేచి వచ్చింది. తప్పుకోవటానికి సరియైన సాకు ఆమె నోటివెంటే వినవచ్చింది.

నేను నవల వ్రాయటం ప్రారంభిస్తే... అది పూర్తి అయ్యేదాకా నన్ను డిస్టర్బ్ చేయదు. సో... ఆపత్కాలంలో చిన్న అబద్ధం ఆడినందువల్ల కలిగే నష్టం ఏముంది?

“ఆల్ రైట్ ... మూడు రోజుల్లో నీ రాత కోతలు ఫినిష్ అయిపోవాలి. ఆ తర్వాత నువ్వు ఎన్ని అభ్యంతరాలు చెప్పినా నేను వినను. మరి వుంటాను. గుడ్ నైట్... హావ్ స్వీట్ డ్రీమ్స్...” అంటూ డిస్కనెక్టు చేసింది నా మాటలు విని.

బ్రతుకు జీవుడా అనుకుంటూ రిసీవర్ ని క్రెడిల్ చేయబోయి... ఎందుకైనా మంచిదని టీపాయ్ మీద పెట్టాను. ఇక అది మోతలు చేయదు. ఎవరైనా వచ్చి తలుపు తడితే తప్ప నాకు డిస్టర్బెన్స్ వుండదు.

ఏడున్నర గంటలు సూచించింది టైంపీస్ ముఖానికి పట్టిన చెమటలను భుజం మీది టవల్ తో తుడుచుకుంటూ జ్యోతిర్మయ చక్రంలోకి ప్రవేశించాను.

పద్మాసనం వేసుకొని కూర్చుని ఎదురుగా వున్న జ్యోతి మీద చూపులను నిగిడ్చాను.

పది నిముషాలు తదేక దీక్షగా చూసేసరికి ఏకాగ్రత కుదిరింది. నా పెదిమలు అప్రయత్నంగా కొన్ని సంస్కృత పదాలను ఉచ్చరించటం ప్రారంభించాయి. మరో పది నిముషాలు దొర్లిపోయాయి. ఆ నిశబ్ద నిశీధిలో ఎంత చిన్నగా వుచ్చరించినా... నా గొంతు కంచుగంటలా ఖంగున ప్రతిధ్వనిస్తోంది.

గాలికి అల్లల్లాడుతున్న జ్యోతులు... కదలటం ఆగిపోయింది. గాలి వీస్తూనే వుంది. వాటిలో చలనం కనిపించటం లేదు.

కొన్ని వేల సంవత్సరాల క్రితం... ఐహిక సుఖాలను త్యజించి ఎండకు ఎండి, వానకు తడిసి _ కఠోరమయిన తపస్సు చేసి, మన మహర్షులు మలిచిన మహామంత్రాలవి. వాటినిఉచ్చరించి _ వాటిలో నిక్షిప్తమై వున్న మహాశక్తిని నిద్దుర లేపాను నేను.

మంత్రోచ్చాటన మొదలుపెట్టిన అరగంటకల్లా... ఏదో కంటికి కనిపించని శక్తి జ్యోతిర్మయ చక్రాన్ని ఆవహించుకున్నది.

ఎర్రటి కాంతులు వెలువరుస్తున్న జ్యోతులు _ నీలి రంగుకు తిరిగాయి.

ఎనిమిదిన్నరకు నా మంత్రోచ్చాటన ముగిసింది. టీపాయ్ మీద వున్న టైంపీస్ వైపొకసారి చూసి, జ్యోతిర్మయ చక్రంలో వెల్లికిలా పడుకున్నాను.

నేను ఆవాహన చేసిన శక్తి... నాకు రక్షణ కల్పిస్తుందని తెలుసు. ఆ విషయం తెలిసినా... ఆతర్వాత వేయబోయే అడుగు నాకు విపరీతమయిన భయాన్ని కలిగించింది. రెండు క్షణాలు తటపటాయించాను.

రోటిలో తలపెట్టి రోకటి పోటుకు భయపడటం దేనికి అనుకుంటూ కనులు మూసుకొని... నాలుగు బీజాక్షరాల చేరికతో కూర్చబడిన మాలినీ మంత్రాన్ని నాలుగు సార్లు ఉచ్చరించాను.

ఆవలింతలు వచ్చాయి. రెండు క్షణాలలో గాఢమయిన నిద్ర నన్ను ఆవరించుకున్నది. నిద్రపట్టిన మరుక్షణం అసలు తంతు ఆరంభమయింది.

నిద్రలో ఒక కల... ఆ కలలో నేను వళ్ళు విరుచుకుంటూ జ్యోతిర్మయ చక్రంలో నిలబడి వున్నాను.

నిద్రిస్తున్న నా భౌతికకాయం... కొట్ట వచ్చినట్లు నాకు కనిపిస్తూనే వుంది. నాకు, దానికి వున్న సంబంధం తెగిపోయింది. గాలిలో తేలుతున్నట్లు అతి తేలికగా ఉన్నాను. శరీరం మీద బట్టలేవీ లేవు. తెల్లగా... సున్నంతో తయారు చేయబడిన బొమ్మలా ధగధగా మెరుస్తున్నది నా దేహం.

అలా నగ్నంగా నిలబడేసరికి సిగ్గు వేసింది. కాని తప్పదు. మాలినీ మహామంత్రం ఉచ్చరించి శరీరాన్నుంచి ఆత్మను వేరు చేసుకోవచ్చు. మానవాతీతమైన ఆ దశలో... మానవులు ధరించే దుస్తులు ధరించటం అసంభవం. కావాలంటే రూపం మార్చుకోవచ్చు.

ఆ మాట జ్ఞాపకం రాగానే చిన్న పికిలి పిట్ట అవతారం ఎత్తాను. ఆ సమయంలో నాకు గోడలు... తలుపులు మొదలైన అడ్డంకులు వుండవు. ఎక్కడికి వెళ్ళదలుచుకున్నా... వెళ్ళిపోవచ్చు... నిరాటంకంగా.

గదిలోనుంచి బయట పడేసరికి చెల్వి నా హృదయంలో మెదిలింది. ఆత లంపు రావటమే ఆలస్యం... క్షణంలో ఆమె గది ముందుకు చేరుకున్నాను చెల్వి _ అప్పుడే చదువుతున్న పుస్తకం మూసి వళ్ళు విరుచుకుంటున్నది. నిండైన ఆ విగ్రహం. కనులు చెదరగొట్టే ఆమె అందం... ఆ పరిస్థితిలో కూడా నన్ను పిచ్చివాణ్ని చేశాయి.

అంతవరకూ ఆమె బెడ్ రూమ్‌ని నేను చూడలేదు. ఎప్పుడు వారి ఇంటికి వచ్చినా, డ్రాయింగ్ రూంలో కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకోవటం తప్పించి... ఆ డ్రాయింగ్ రూంకు అవతల వున్న గదులవైపే చూసేవాడిని కాదు.

మొదటిసారిగా ఆమె పడక గదిని పరికిస్తున్నాను... టేబిల్ లైటు ఆర్పి హంసతూలికా తల్పంలావున్న పెద్ద ఫోమ్ బెడ్ మీద మేను వాల్చింది చెల్వి. గదిలో ఆకుపచ్చ రంగు బెడ్ లైటు వెలుగుతోంది. ఆకాంతులలో ఆమె సౌందర్యం మరో వెయ్యిరెట్లు కొట్టవచ్చినట్లు కన్పిస్తోంది.

"చెల్వి!" అని పిలిచాను అప్రయత్నంగా.

నా మాట వినిపించుకోలేదామె. మంచం తలగడ వైపున్న టీపాయ్ మీది పుస్తకాన్ని అందుకొని పేజీలు తిరగవేస్తోంది.

"చెల్వీ!" అని మరోసారి పిలిచి... నా అవివేకానికి నన్ను నేనే నిందించుకున్నాను.

మానవ సహజమయిన అనుభూతులకు గురి అవుతున్నా... మానవ ప్రపంచంతో నాకు సంబంధం వుండదాసమయంలో, అవతలి వారి మాటలను చేతలను నేను ఆకర్షించుకోగలను. నా మాటలు వారికి వినిపించవు. నేను వారికి కనిపించను.

చెల్వి చూస్తున్న పుస్తకం ఏమిటో తెలుసుకోవాలన్న కుతూహలం కలిగింది. వెంటనే గోడవైపు ఎగిరాను. రెండుగా విచ్చుకున్నట్లు వినిపించింది ఆ గోడ. మరుక్షణం నేను ఆమె గదిలో వున్నాను.

నేను వ్రాసిన పుస్తకమే అది చెల్వి పుస్తకం చదవటంలేదు. దాని మధ్యలో పెట్టివున్న ఫోటోను పరికిస్తున్నది అరమోడ్పుకనులతో.

ఆమె తలగడమీద వాలి పుస్తకంలోకితొంగి చూశాను. నా కళ్ళు బైర్లుక్రమ్మినట్లు అనిపించింది. అదే సమయంలో... నేను నా మానవదేహంలో గనుక వుండి వుంటే, అలాగే వున్నవాడిని వున్నట్లు విరుచుకు పడిపోయే వాడిని.

అది నా ఫోటోనే. నా కళ్ళముందే... చెల్వి.. మృదువుగా ఆ ఫోటోను చుంబించింది.

“మధూ డియర్... ఏమీ తెలియనట్లు యింకా ఎంతకాలం తప్పించుకు తిరుగుతావ్? ఈ సంవత్సరం చదువు అయిపోనీ... నీ పని చెప్తాను.” అంటూ.

ఇకఇక్కడక వుండలేకపోయాను. ఇంకో పది జన్మలు ఎత్తేదాకా ఆ మధురాను భూతి నా మనస్సును వదిలిపెట్టిపోదు. చెల్వివంటి కన్నెపిల్ల ప్రేమకు పాత్రుణ్ణి కాగలిగాను...అందుకు అర్హత వున్నదో... లేదో అన్న విషయం అప్రస్తుతం చూసింది చాలు.

అమృతం తాగినట్లు ఆనంద సాగరంలో యీతలు కొట్టసాగింది నా మనస్సు. అదే సమయంలో కర్తవ్యం నా వెన్నుతట్టి హెచ్చరించింది.

వెంటనే గాలిలోకి లేచాను. ఎంతవేగంతో ప్రయాణించానో తెలియదు కాని... ఉదయపూర్ లోవున్న అటమిట్ రీసెర్చి లేబరేటరీలను సమీపించేసరికి సరిగ్గా తొమ్మిదిన్నరగంటలు అయింది.

లేబరేటరీ బిల్డింగులకు రెండు ఫర్లాంగుల యివతలగా సైంటిస్టులకోసం కట్టబడిన భవంతులు వున్నాయి. ఆ ప్రదేశం చుట్టూ ఎనిమిది అడుగుల ఎత్తున ఐరన్ ఫెన్సింగ్ వుంది. ముట్టుకున్న మరుక్షణం మాడ్చిమసిచేసే శక్తిగల హైవోల్టేజి కరెంటు ఫెన్సింగ్‌లో ప్రవహిస్తున్నది.

ఫెన్సింగ్ బయట మిషన్ గన్స్ పట్టుకున్న సైనికులు అప్రమత్తతగా పహరాయిస్తున్నారు.

సెక్యూరిటీ హైలెవెల్‌లో వుంది. వారిని, ఆ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్‌ని దాటి శత్రువులు లేబరేటరీలోకిగాని, సైంటిస్టుల నివాస ప్రదేశంలోకిగాని అడుగుపెట్టలేరు.

అవేవీ నాకు అడ్డుకాదు. ఎలక్ట్రిసిటీ నన్నేమీ చేయలేదు. మానవ సంబంధమైన బాధలకు అతీతుణ్ణి నేను _ ఆ సమయంలో.

అయినాసరే ఎందుకైనా మంచిది అనుకుంటూ ఫెన్సింగ్‌కి పది అడుగుల ఎత్తులో ఎగురుతూ సైంటిస్టుల నివాస ప్రదేశంవైపు వెళ్ళాను.

మొదటి భవంతి ప్రొఫెసర్ కల్యాణ కుమార్‌ది. భారతదేశం దాస్య శృంఖలాలలో మ్రగ్గుతున్న సమయంలో _ స్వాతంత్ర సముపార్జనకోసం సర్వం త్యాగం చేసిన దేశభక్తుడాయన. ఆయన్ని అనుమానించటం మహాపాపం. కాని పాపపుణ్యాలను కమాండ్ చేసే ఆదిపరాశక్తియైన కాళికాదేవీ తను సృష్టించిన త్రిమూర్తుల నడవడికను అనుమానించి ఆత్రానికి గురియైనట్లు మన పురాణాలు తెలుపుతున్నాయి. ఆఫ్టరాల్ సామాన్యమానవుణ్ణి _ నేను అనుమానానికి గురి అవటంలో వింత ఏముంది?

పాపపుణ్యాలను గురించి ఆలోచన చేయటం ఆపి, భవనంలోకి వెళ్ళాను బెడ్‌రూమ్‌లో కనిపించాడు కళ్యాణ కుమార్. భార్యతో ఏవో మంతనాలు జరుపుతున్నాడు.

దగ్గరికి వెళ్ళి బెడ్ మీద ఒక ప్రక్కగా వాలి వారి సంభాషణ విన్నాను. ఏదో ఫామిలీ ట్రబుల్ _ ఏకైక సంతానం, వంశోద్ధారకుడు అయిన కొడుకు రవి కుమార్ కల్యాణం గురించి తాపత్రయ పడుతున్నారు వారిద్దరూ.

అరగంటసేపు అక్కడే వున్నాను. లాబరేటరీ గురించి కాని, తనుచేస్తున్న ప్రయోగాలను గురించి కాని అతను ప్రసంగించలేదు. అతని భార్య ఆ ప్రసక్తే ఎత్తలేదు.

తరువాత బిలింగ్ కల్యాణకుమార్ అసిస్టెంట్ సుఖదా రవిరాజ్‌ది. నలభై సంవత్సరాల విడో ఆమె. నిప్పులాంటి మనిషి.

ఆ సమయంలో నిప్పు, నీళ్ళు నాకు అనవసరం. ఆమె ద్వారా ఇన్‌ఫర్‌మేషన్ బయటికి పొక్కే అవకాశం వుందా లేదా?

మరో అరగంట తరువాత లేదని తెలిసింది. పగలంతా విపరీతమైన ఆలోచనలతో గడిపింది కాబోలు _ వెయ్యి ఏనుగులు వచ్చిమీద పడి తొక్కినా మెలుకవ రానంత గాఢ నిద్దురలో వున్నదామె.

ఒకటి తరువాత ఒకటిగా, ఒకర్ని విడిచి మరొకరినిగా సైంటిస్టులందర్నీ పరిక్షించాను. సెక్యూరిటీ అధికారులను పరిశీలించాను. ఎంత ప్రయత్నించినా అనుమానించదగ్గ ఆధారమేదీ నాకు కనిపించలేదు.

కులకర్ణిగారి మాటలు సెంట్ పర్సంట్ కరెక్ట్. లేబరేటరీ నిర్వాహకులలో, సైంటిస్టులలో దోషం ఏదీలేదు. మరి ఎక్కడ వున్నట్లు?

ఎక్కడో వుంది. అది కులకర్ణిగారికి చూచాయగా తెలిసింది. నాకు తెలియబోతున్నది.

సెక్యూరిటీ హెడ్ జీవరత్నం క్వార్టర్స్ లోనుంచి బయటికి వచ్చి ఒక ఎలక్ట్రిక్ పోల్ మీద వాలాను.

అప్పటికి రెండు గంటలు దాటింది. నేను బయలుదేరి చాలాసేపయింది. ఇక యింటికి చేరుకోవటం చాలా మంచిది.

మర్నాడు కులకర్ణిగారిని కలుసుకొని అన్నీ వివరంగా చర్చిద్దామని అనుకుంటూ గాలిలోకి ఎగిరాను.

అదే సమయంలో... శరీరంలోని రక్తం గడ్డకట్టుకుపోయేటంత చలిగాలి వీచింది.

భరించరాని దుర్వాసన నా వూపిరిని స్తంభింపచేసింది. ఎంత బిగపట్టుకున్నా ఆగకుండా నా సర్వాంగాలు _ భయంతో కంపించటం ప్రారంభించాయి.

ఒకే ఒక క్షణంసేపు వుందా జలదరింపు. వెంటనే గడిచిపోయింది. ఎలక్ట్రిక్ షాక్ తిని యివతల పడిన మనిషిలా నీరసం నన్ను ఆపాదమస్తకం ఆవరించుకుంది.

కులకర్ణిగారి అనుమానం యదార్థం. అందుకు సాక్ష్యం నా ముందే కనిపిస్తున్నది.

దడదడలాడుతున్న గుండెలను చిక్కపట్టుకొని ముందుకు చూశాను. నల్లటి గబ్బిలం ఒకటి లాబరేటరీ భవనాల మీద చక్కర్లు కొడుతున్నది.

ఎవరైనా చూస్తే గబ్బిలం లాగానే కనిపిస్తుంది. కాని దైవికశక్తుల రక్షణలో ఆత్మస్వరూపం దాల్చిన నాకు మాత్రం, దాని నిజస్వరూపం కొట్టివచ్చినట్లు అగుపిస్తున్నది.

పుర్రెలాంటి ముఖం. నల్లటి శరీరం _ పొడుగాటి శిరోజాలు _ నాలుగు అంగుళాల పొడుగున్న గోళ్ళు ఆ ఆకారం అంధకార శక్తుల పనుపున అక్కడికి వచ్చినట్లు తెలుస్తూనే వుంది.

అది నన్ను చూడలేదు. చూసి వుంటే కథ అక్కడితో అంతమై వుండేది. పది నిముషాలపాటు లాబరేటరీల మీద చక్కర్లు కొట్టిందా ఆకారం. పది నిముషాల తరువాత వెనుతిరిగి వచ్చిన దారినే బయలుదేరింది.

అది నన్ను చూసిన మరుక్షణం ఎటాక్ చేస్తుంది. అందులో సందేహంలేదు. అంధకారశక్తులకూ, దైవిక శక్తులకు పోరాటం యీనాడు పుట్టలేదు. పురాణకాలం నుంచీ కొనసాగుతూనే వుంది. యింకా కొనసాగుతుంది కూడా. దైవిక శక్తులను రిప్రజెంట్ చేస్తున్నాను నేను. ఆసమయంలో పైపెచ్చు అదిచేసే పని ఏమిటో తెలుసుకోవటానికి వచ్చాను, యిక వూరుకుంటుందా?

"వద్దు పోవద్దు" అని అంతరంగం హెచ్చరిస్తున్నా వినకుండా, ఆ ఆకారాన్ని అనుసరించాను.

ఉదయపూర్ పట్టణం దాటాం... హైరోడ్‌కు ఆవలవున్న శ్మశానం వైపు పయనించిందా ఆకారం.

స్మశానం సరిహద్దులో అడుగుపెట్టిన మరుక్షణం ముందుకు పోతున్న నేను _ ఒక్కసారిగా నేల వాలిపోయాను.

పక్షవాతం వచ్చినట్లు నా సర్వాంగాలు స్తంభించిపోయాయి నా చుట్టూ నల్లటిపొగలు ఆవరించియున్నాయి.

ఆ పొగలలోనుంచి, పది తలలున్న పొడల పాములు. నోళ్ళు తెరుచుకుని నన్ను మ్రింగటానికి ముందుకు వచ్చాయి.

***

వాటికి వెనుకగా ఆకాశంలో పల్టీలు కొడుతూ వికృతంగా నవ్వుతున్నదా ఆకారం.

అంధకార శక్తులకు నా వునికి తెలిసిపోయింది. నన్ను నాశనం చేసేదాకా అవి విశ్రమించవు.

భయంతో నా నాలుక బిగపట్టుకు పోయింది. జ్యోతిర్మయ స్వరూపాన్ని ధ్యానించి ఆపదనుంచి బయటపడదామని ప్రయత్నించాను.

"శాంభవీ దుర్గిదేవతా, వనలక్ష్మి" అంతే... ఆవేశంలో పల్టీలు కొడుతున్న ఆకారం భయంకరంగా నవ్వింది.

నా గొంతుమీద కనిపించని చేతులేవో పడి బిగించినొక్కి పట్టుకున్నాయి. నోటిలోని మాటలు నోటిలో ఆగిపోయాయి.

పొడల పాములు నా శరీరాన్ని నోళ్ళతో కరిచి పట్టుకున్నాయి. ఒక్కొక్క బొట్టుగా నా రక్తాన్ని పీల్చి _ నన్ను పిప్పి చేయటం ప్రారంభించాయి.

నిరాశ నిస్పృహలతో నా కళ్ళు చెమ్మగిల్లాయి. అనుకున్నంతా అయింది. సాటిలేని మహామంత్రాలను సృష్టించిన మన మహర్షులు. వాటికి అనేక రకాల నిభంధనలను విధించటం యిందుకే. అవి సాధించి లేని పోని గొడవల్లో

తలదూరుస్తారనే సామాన్యులకు అర్థం కాని విధంగా యీ విషయాలను వేదాల్లో నిక్షేపించారు.

నా తల మీద చక్కర్లు కొడుతున్న ఆకారం... నవ్వుతున్న వికృతపునవ్వు నా చెవుల్లో చావుడప్పుల్లా ప్రతి ధ్వనించటం ప్రారంభించింది.

అయిపోయింది ది గ్రేట్ ఆథర్ మాధవ్... అనేక రకాల రచనలు చేసి అందరి మన్ననలను చూరగొన్న రచయిత _ ఎవరికీ తెలియని మంత్ర తంత్రాలను తెలుసుకొని అపూర్వమైన ప్రజ్ఞాపాఠవాలను సంపాదించిన మెజీషియన్ _ ఆఖరికి అంధకార శక్తుల చేతిలో హతమారబోతున్నాడు.

తెల్లవారేసరికి మద్రాసు నగర పౌరులు, ఒక మామిడి తోపులోవున్న గది మధ్య గుండె ఆగి చనిపోయిన మాధవ్ మృతదేహాన్ని చూస్తారు. గుండె ఆగటం వల్ల చనిపోయాడని అంటారు డాక్టర్లు.

అసలు విషయం చనిపోబోతున్న నాకు తెలుసు. కులకర్ణిగారికి తెలుసు. మరెవరికీ తెలియదు.

మైకపు తెరలు నన్ను పూర్తిగా ఆవరించుకున్నాయి. నా కళ్ళు ముందు అంతూ పొంతూ లేని అంధకార లోకం ప్రత్యక్షమయింది. అందులో ప్రవేశిస్తే తిరిగి బయటపడటం అంటూ జరగదు. యుగాల పర్యంతం _ నా ఆత్మనరక బాధలను మించిన బాధలకు గురి అవుతూ కృంగికృశించి పోతుంది. నశించిపోదు.

నన్ను చుట్టుముట్టివున్న పొడల పాములు నన్ను అంధకార రాజ్యంలోకి లాక్కుపోతున్నాయి. భగవంతుణ్ణి తలుచుకోవటానికి కూడా వీలులేని పరిస్థితితో చిక్కుపడి గిజగిజలాడిపోతున్నాను.

అదే సమయంలో _ ఎక్కడో కొక్కొరొకో! అని కూసిందొక తొలికోడి. అదిరి పడి నన్ను వదిలాయి అంధకారశక్తులు. కన్ను మూసి కన్ను తెరిచేటంతలో మాయమైపోయాయి.

అధోగతి నుంచి నేను రక్షింపబడ్డాను. అలనాడు ఇంద్రుడి దురాగతానికి అలిగి భార్య అహల్యను బండరాయిగా మార్చిన గౌతముడు_ అదే నోటితో మానవులకి ఒక మహోపకారం చేశాడు.

తొలికోడి కూతబెట్టిన తర్వాత ఇంద్రజాల. మహేంద్రజాల, టక్కు, టమార, గజకర్ణ, గోకర్ణాది విద్యలు పనిచేయవు. అంధకార శక్తుల ఆట కట్టుబడి అవుతుంది.

అదే కారణం ఆ క్షణంలో నాకు ప్రాణదానం చేసింది. బ్రతుకు జీవుడా అనుకుంటూ గాలిలోకి లేచాను. క్షణంలో నా గదికి చేరుకొని నా దేహంలో ప్రవేశించాను.

వెంటనే తెలివి వచ్చింది. ఆవలిస్తూ లేచి కూర్చున్నాను. ఒక్కక్షణంపాటు అంతా అయోమయంగా కనిపించింది.

చుట్టూ చూశాను. దేదీప్యమానంగా వెలుగుతున్నది నేను ప్రతిష్ఠించిన జ్యోతిర్మయ చక్రం.

టీపాయ్ మీది గడియారం మూడున్నర సూచిస్తోంది. నన్ను రక్షించిన జ్యోతిర్మయ స్వరూపానికి కృతజ్ఞతలు తెలుపుకొని, జ్యోతిర్మయ చక్రాన్ని తుడిచివేసి _ గోడ కానించివున్న సోఫాలో కూలబడ్డాను.

జరిగినదంతా కలలాగా అనిపిస్తోంది. కాని కలకాదు. లాబరేటరీ రహస్యాలు బయటికి పొక్కటం _ సామాన్య మానవుల ప్రయత్నంతో కూడుకున్నదికాదు. ఆ పని చేస్తున్నది అంధకార శక్తులు.

వాటినెవరో ఆవాహన చేస్తున్నారు. నేను ఎదుర్కొన్న అనుభవం చూస్తుంటే ఆ మనిషి ఎవరో అపరిమిత ప్రజ్ఞావంతుడని తెలుస్తున్నది.

ఏదో సరదాగా... వూరికే కూర్చోలేక యీ మంత్రతంత్రాలను గురించి తెలుసుకున్నాను గాని, నిజంగా నాకు యీ విషయాలలో అంతగా అనుభవంలేదు.

నాకున్న మిడిమిడి జ్ఞానంతో _ అనుభవజ్ఞులను ఎదిరించి నిలబడగలనా? ఎంతసేపు ఆలోచించినా _ నా సమస్యకు సమాధానం లభించలేదు. ఆలోచనల్లో పడి టైం ఎనిమిది అయిందని కాని _ చెల్వి కారు నా గది ముందు ఆగిందని కాని గమనించ లేకపోయాను.

"నవల రాస్తున్నానని చెప్పి రాత్రంతా ఎక్కడ తిరిగి వచ్చావ్? ముఖమంతా అలా పీక్కుపోయి వుండటానికి కారణం ఏమిటి?" అంటూ సుడిగాలిలా వచ్చి పడింది చెల్వి.

ఆమె మాటలతో వులిక్కిపడి యీ లోకంలోకి వచ్చిపడ్డాను. అప్పటికే ఆలస్యం అయిపోయింది. జరగవలసిన డామేజి జరిగిపోయింది.

***

జ్యోతిర్మయ చక్రంతో అవసరం తీరిపోగానే దాన్ని తుడిచివేసి నిరుపయోగం చేసేయాలి. తెలివి రాగానే నేను చేసిన మొదటి పని అదే. అయితే బద్ధకంవల్ల కొంతా ఓపిక లేక మరికొంతా, అంతా కలిసి ఆప్రమిదెలను నిమ్మకాయలను అక్కడే వదిలేశాను.

గదిలోకి అడుగుపెట్టిన మరుక్షణం చెల్వి వాటిని గమనించింది. మరుక్షణం ఆమె కళ్ళు ఎరుపుజీరలను పులుముకున్నాయి. కోపంతో పెదవులు అదరసాగాయి.

“మధూ! తెల్లవారుఝామున మూడు గంటలకు నీకు ఫోన్ చేశాను. నాకు సమాధానం రాలేదు.” అన్న టీపాయ్ మీద విడిగా పడవేసి వున్న రిసీవర్ని చూస్తూ.

తుఫాన్ రాబోతున్నదని తెలుస్తూనే వుంది. ముందు జాగ్రత్తపడదామని ప్రయత్నించాను. రాత్రి జరిగిన సంఘటనలు. నా శక్తిని పూర్తిగా హరించి వేశాయి. నోటివెంట మాటలు రాలేదు.

“ఏదో మంత్రాలకు సంబంధించిన పుస్తకాలు చదివి అవి ఆధారంగా నవలలు వ్రాస్తున్నావని అనుకున్నాను గాని, యిటువంటి వ్యవహారాలు మొదలుపెట్టానని గ్రహించలేకపోయాను. నీకు అసలు మతి వున్నదా? యిటువంటి పనులు బెడిసి కొడితే నీ గతి ఏమౌతుందో తెలుసా?”

నవ్వాలనిపించింది నవ్వు రాలేదు.

"ఈ సంగతి నలుగురికీ తెలిస్తే ఎంత అప్రతిష్ఠ? అందరూ కలిసి మంత్రగాడివని ముద్రవేసి నీ పళ్ళుపీకించే ప్రయత్నాలు చేయకుండా వుంటారా?"

మాట మీద మాటగా వదులుతున్నది చెల్వి. ఆమె మాటలలో కొంత నిజం లేకపోలేదు. నేను ఎందుకు అటువంటి ప్రయత్నం ప్రారంభించానో చెప్తే నమ్ముతుంది! కాని యిది సి.ఐ.బి వ్యవహారం. రెండో కంటివాడికి తెలియకూడని అతి రహస్యం.

అదీకాక నేను అటువంటి పరిస్థితిలో సంబంధ బాంధవ్యాలు కలిగి వున్నానని తెలిస్తే మరింత గోల చేస్తుంది చెల్వి. సి.ఐ.బి. లాంటి ఏజెన్సీలు మన దేశానికి అనవసరం అని ఆమె అభిప్రాయం.

నా ఆలోచనలు అంతూ పొంతూ లేకుండా కొనసాగిపోతూనే వున్నాయి. చెల్వి వదులుతున్న వాగ్బాణ పరంపర ఆగకుండా నా మీదికి వస్తూనే వుంది.

తొమ్మిది గంటలకు ఢిల్లీ పోయే విమానం ఒకటి వుందన్న సంగతి గుర్తుకు వచ్చి నాలో చైతన్యం వచ్చింది.

చివాలున లేచి బెడ్ రూమ్ లోకి వెళ్ళాను. చేతికి అందిన వస్తువులను సూట్‌కేస్‌లో కుక్కుకొని "చెల్వీ ప్లీజ్. నన్ను ఎయిరోడ్రోమ్‌లో డ్రాప్ చెయ్యి" అంటూ ఆమె కారులో కూర్చున్నాను.

చెల్వి నోటిలోని మాటలు నోటిలోనే ఆగిపోయాయి. రెండు క్షణాలు నిదానించి చూసింది నా వంక.

పమిట చెంగును విరిచి కట్టుకొని నా గదికి తాళం వేసి వచ్చి స్టీరింగ్ ముందు కూర్చుంది.

ఆమె ఏదో నిర్ణయానికి వచ్చినట్లు ఆ చర్యలు నన్ను భయపెట్టాయి. అడిగే ధైర్యం లేక మౌనం వహించాను.

అరగంటలో ఎయిరోడ్రామ్ చేరుకున్నాం. నన్ను విజిటర్స్ గాలరీలోనే వుండమని గదమాయించి పోయి రెండు సీట్లను బుక్ చేసి వచ్చింది చెల్వి.

"రెండు దేనికీ!" ఆశ్చర్యంగా ప్రశ్నించాను.

"మిస్టర్ మాధవ్! నువ్వేదో ఫోజు వేస్తున్నావ్. అదేదో తెలుసుకునే దాకా నిన్ను వదిలిపెట్టను." ఖండితంగా చెప్పేసింది.

"మీ ఫాదర్ వెతుకుతూ వుంటారు నీకోసం."

"డోన్ట్ వర్రీ! ఫోన్ చేసే వచ్చా."

ఇకఆపైన ఏం మాట్లాడాలో _ ఆమెకు ఎలా సమాధానం చెప్పాలో నాకు అర్థంకాలేదు. ఏం మాట్లాడినా పోరాటం తప్పేటట్లు లేదు.

మరో అరగంట తరువాత విమానం ఢిల్లీకి ప్రయాణం ప్రారంభించింది. నాలుగు గంటల తరువాత పాలం విమానాశ్రయంలో కులకర్ణిగారు నాకు ఎదురు వచ్చారు.

చెల్విని చూడగానే ఆయన కనుబొమలు ముడివడ్డాయి. చెల్వి చూడకుండా ఆయనకు సైగ చేశాను. అర్థం చేసుకున్నారాయన.

అక్కడ మరి టైం వేస్ట్ చేయకుండా కులకర్ణిగారి వైట్ అంబాసిడర్‌లో ఆయన బంగ్లాకు వెళ్ళాము.

చెల్విని తన భార్యాబిడ్డలకు పరిచయం చేశారాయన. వెంటనే విషయం అర్థం చేసుకున్నారు వారు. నేర్పుగా చెల్విని మాటల్లో పెట్టి తమతో అవతలికి తీసుకుపోయారు.

“మధూ! రేపు మరొక బాచ్ పరిశోధనలు పూర్తి అవుతాయి. అవి పరాయి వారికి తెలిస్తే _ యిక మనం పరిశోధనలు కంటిన్యూ చేయటం అవసరం.”

చెల్వి లోపలి గదులలోకి వెళ్ళిన మరుక్షణం నా నెత్తిమీద ఒక బాంబు వేసినంత పని చేశారు కులకర్ణి.

***

నా అనుమానాలను, అనుభవాలను ఒకసారి చెప్పగానే అర్థం చేసుకున్నారు కులకర్ణి. ఆ రాత్రికే మరొక ప్రయత్నం చేయటానికి సిద్ధపడ్డాను నేను.

సాయంత్రం నాలుగు గంటల దాకా కులకర్ణిగారి బంగ్లాలోనే గడిపి, ఐదు గంటల వేళకు బజార్లు చూడటానికి బయలుదేరాను.

చెల్వి నన్ను అనుసరించింది. నీడనైనా వదిలించుకోవచ్చుగానీ, చెల్విని వదిలించుకోవటం కష్టం. చిన్నతనం నుంచీ అతి గారాబంగా పెరిగింది. అందువల్ల అంతులేని మొండితనం వచ్చింది ఆమెకు.

కారును సరాసరి సెక్రటేరియేట్ ఆఫీసర్స్ కాలనీ ముందు ఆపాను.

ఒక ప్లాటుముందు నిలబడ్డామో లేదో _ లోపలినుంచి సుడిగాలిలా వచ్చిపడింది బిందు. ఆమె వెనుక షాడో, ముఖేష్, శ్రీకర్‌లు పరిగెత్తుకుంటూ వచ్చారు.

“అబ్బ! రచయితగారికి యింత కాలానికి మేము గుర్తుకువచ్చామన్నమాట! సంతోషం. మా జన్మ తరించింది!!” ఎత్తిపొడుపు మాటలతో స్వాగతం యిచ్చింది బిందు.

మిగిలిన హీరోలందరూ నాతో కరచాలనం చేశారు. చెల్విని అభిమాన పూర్వకంగా పలుకరించారు.

“గురూ! నన్ను హీరోనిచేసి ఒక కథ రాయకూడదూ!” అంటూ బ్రతిమిలాడాడు శ్రీకర్.

“నీ ముఖం… నీ సీనియర్లు హీరోలు కాందే జూనియర్‌వి నీకు ఛాన్స్ ఎలా వస్తుంది!” వెక్కిరించాడు ముఖేష్.

షాడో ఏమీ మాట్లాడలేదు. మా యిద్దరికీ మాటలతో పనిలేదు. మొదటినుంచీ అంతే. అతను దొంగగా దేశాన్ని హడలకొడుతున్న సమయంలో కూడా అంతే. పోలీసుల బెడద ఎక్కువైతే కామ్‌గా నా దగ్గిరికి వచ్చేసేవాడు. ఒక నెల రెండు నెలలపాటు ఎక్కడికీ కదలకుండా నా గదిలోనే వుండిపోయేవాడు. ఆ నెలా రెండు నెలల్లో మేము మొత్తం ఓ పదిసార్లు మాట్లాడుకునేవాళ్ళం.

నేను ఢిల్లీ ఎందుకు వచ్చానో వారికి తెలుసు. అందువల్ల ఎటువంటి ప్రశ్నలూ వేయలేదు.

తొమ్మిది గంటలదాకా కబుర్లతో కాలక్షేపం చేశాము. తొమ్మిదిన్నరకు బిందు సినిమా ప్రోగ్రాం వేసింది.

ఎవరో స్నేహితులు రమ్మన్నారట, తనతోపాటు చెల్విని మాత్రం తీసుకుపోతానని అన్నది.

చెల్వికి బిందు అంటే చాలా అభిమానం. అందువల్ల మారుమాటాడకుండా అనుసరించింది.

వెంటనే నా ప్రయత్నాలు ప్రారంభించాను. బెడ్‌రూమ్ లోవున్న సామానంతా అవతలి గదిలోకి చేర్చాడు షాడో.

కార్పెట్‌ని చుట్టచుట్టి నేలను శుభ్రం చేశాడు ముఖేష్, శ్రీకర్ నాకు కావల్సిన సరంజామను అందించాడు.

అంధకార శక్తులతో పోరాటం[1] అంటే ఏమిటో, అది ఎలా వుంటుందో వారందరికీ తెలుసు. లోగడ స్వామీజీ అనే మంత్రవేత్త తన మంత్ర శక్తులతో ప్రపంచంలో గడబిడ సృష్టించటానికి ప్రయత్నించాడు. అతన్ని ఎదిరించటానికి నేను, షాడో, ముఖేష్, శ్రీకర్, బిందు, కులకర్ణిగారు పడిన బాధలు సామాన్యమైనవికావు.

పదిగంటలకల్లా ఆత్మస్వరూపంతో అంతరిక్షంలోకి వెళ్ళాను నేను.

నా భౌతిక శరీరానికి జ్యోతిర్మయ చక్రపు రక్షణవుండి. దానికి అవతల షాడో, ముఖేష్, శ్రీకర్లు కాపలావున్నారు.

అయినా నాకు కొంచెం అదుటుగానే వున్నది. అంధకారశక్తులకు నా విషయం అర్థం అయిపోయింది. ఈసారి కొంచెం గొడవ జరుగకుండా వుండదు.

---

[1] హారర్స్ ఆఫ్ డార్క్‌నెస్, ఏంజల్ ఆఫ్ డెత్, ఎ డెవిల్ ఎ స్పై మొదలైన నవలలో మాధవ్, షాడోల సాహస చర్యలు వివరించబడ్డాయి.

ఉదయపూర్ లేబరేటరీల చుట్టూ రౌండ్లుకొట్టటం ప్రారంభించాను. పన్నెండుగంటల దాకా ఎటువంటి విశేషమూ కనిపించలేదు. ఒంటిగంట అవుతుండగా_

తిరిగి మరొక్కసారి నా ముందునుంచి వెళ్ళింది ఆ రాక్షసి గబ్బిలం. ఈసారి నేను చాలాదూరంలో వుండిపోయాను. అది లాబరేటరీలపై చక్కర్లుకొట్టి వెనుతిరగగానే అనుసరించటం ప్రారంభించాను.

మళ్ళీ ఉదయపూర్ శ్మశానంవైపు వెళ్ళిందది. నేను శ్మశానంలో ప్రవేశించలేదు, ఒక రౌండ్ కొట్టి దూరంగా నిలబడ్డాను.

శ్మశానం మధ్య ఒక పాడుబడిన బంగ్లా వున్నది. రాక్షసి గబ్బిలం అందులోకివెళ్ళి మాయం అయిపోయింది.

బంగ్లాలోకి వెళ్ళటం మంచిదా కాదా అన్న మీమాంసలో పడ్డాను. వెళితే క్షుద్రశక్తులు నన్ను ఎదిరిస్తాయేమో! వెళ్ళకపోతే అసలు విషయం తెలియదు.

"ఏం చేయాలా అన్న ఆలోచనలో పడి నేను కొట్టుమిట్టాడుతుండగా _ ఎవరో కొరడాతో కొట్టినట్లు జలదరించింది నా శరీరం.

ఎవరో పట్టుకొని విసిరేసినట్లు ఢిల్లీకి వచ్చేశాను.

నా ప్రయత్నం లేకుండానే నా భౌతిక దేహం ముందుకు చేరుకున్నాను.

షాడో, ముఖేష్, శ్రీకర్ గాఢ నిద్రలో వున్నారు. జ్యోతిర్మయచక్రపు జోతుల్లో ఒకటి ఆరిపోయి వుంది.

ఆ మూలనుంచి దారి చేసుకొని ఒక భయంకరమైన పొడలపాము నా శరీరంమీద చుట్టలు చుట్టుకొని ఆడుతున్నది.

దాన్ని చూడగానే క్షుద్రశక్తులకు సంబంధించినదని తెలుస్తూనే వుంది. దాని మంత్ర ప్రభావమే షాడో ముఖేష్‌లు అటువంటి నిద్రలో మునిగి వుండటానికి కారణం.

చూస్తూవుంటే పరిస్థితి చేయిజారి పోతుందేమో అన్న అనుమానం వేసింది.

వెంటనే నా దేహంలోకి ప్రవేశించాను.

అక్కడినుంచీ, నాకు, ఆ పాముకు పోరాటం ప్రారంభమయింది. దాని బలం ముందు, నా శక్తియుక్తులు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. జ్యోతిర్మయ స్వరూపాన్ని తలచుకొని ఏదో ఒకటి చేద్దామని ప్రయత్నించాను అందుకు సందు దొరకలేదు. అవకాశం లభించలేదు. నా మనసంతా పోరాటంమీద లగ్నం చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

క్రమంగా నా బలం సన్నగిల్లిపోయింది. పొడలపాము నా మెడచుట్టూ చుట్టలు చుట్టి ఊపిరి బిగించేస్తున్నది. దాని విషపు కోరలు నా ముఖంమీద దిగబడకుండా, దాని తలను రెండుచేతులలో బిగించి పట్టుకొని తంటాలు పడుతున్నాయి.

ఎన్ని చేసినా ఏమీ ప్రయోజనం లేకపోయింది. షాడోని నిద్రలేపటానికి ప్రయత్నించాను. ఎంత పిలిచినా అతనిలో చలనం రాలేదు.

అదే సమయంలో _ గది మూల నల్లటి పొగ సుడులు తిరుగుతూ ప్రత్యక్షమయింది.

ఆ పొగలోనుంచి అంతకు ముందు నేను వెంటాడిన రాక్షసి గబ్బిలం యివతలకువచ్చి నా మీదికి లంఘించింది.

పక్కకు దొర్లాను. అనుకోకుండా నా కాలు తగిలి జ్యోతిర్మయ చక్రపు జ్యోతులు మరి రెండు ఆరిపోయాయి.

మరుక్షణం వికృతమైన నవ్వులతో దద్దరిల్లిపోయింది ఆ గది.

నా చుట్టూ భయంకరమైన ఆకారాలు... వర్ణించటానికి వీలులేని రూపాలతో ప్రత్యక్షమయ్యాయి. పొడుగాటి కోరలు, పదునైన గోళ్ళు, నల్లటి శరీరాలు_ చూస్తేనే ప్రాణం పోయేటంత భయంకరంగా వున్నాయవి.

అన్నీ కలిపి జ్యోతిర్మయ చక్రాన్ని తుడిచిపారేశాయి. ఒక జ్యోతి ఆరిపోయిన మరుక్షణం దాన్ని ఆవరించుకొని వున్న శక్తి నశించిపోయింది. నేను తన్ని ఆర్పేసిన జ్యోతులు లేకపోయేసరికి _శక్తివంతమైన జ్యోతిర్మయ చక్రం సామాన్యమైన పిచ్చిగీతల మాదిరి అయిపోయింది.

కేకలు పెట్టాలని ప్రయత్నించాను. భగవద్ధ్యానం చేద్దామని అనుకున్నాను. ఏదీ కుదరలేదు. నా ప్రాణం బట్టింది శ్వాస ఆడక నా గుండెలు మండిపోసాగాయి.

ఆ ఆఖరి క్షణాలలో విధిలేక సామాన్యంగా వుచ్చరించకూడని మోహినీ మంత్రాన్ని ఉచ్చరించాను.

మంత్ర మహిమ కానీయండి... కో యిన్సిడెన్స్ కానీయండి _ఏదీ ఏమైనా నేనా తల్లిని తల్చుకున్న రెండు నిముషాలలో గది బయట అడుగుల శబ్దం వినవచ్చింది.

మరోక్షణంలో బిందు, చెల్వి యిద్దరూ గదిలోకి పరుగెత్తుకు వచ్చారు.

“మధూ! ఏమిటి? ఏమయింది?” ఆత్రుతగా అంటూ నా దగ్గిరికి రాబోయిన చెల్విని చేయిపట్టుకొని ఆపింది బిందు.

వారికి నన్ను చుట్టుముట్టివున్న క్షుద్రశక్తులు కనించటంలేదు. నేను ఫిట్స్ వచ్చిన వాడిలా తన్నుకుంటూ వుండటం మాత్రం కనిపిస్తోంది.

బిందుకు అర్థం అయినట్లుంది నా డైలమా! వెంటనే గది మూలవున్న కూజాలోని నీటిని నామీద కుమ్మరించింది.

పరిశుద్ధ జలం అది. అంతకు ముందు నేనే మంత్రించిపెట్టాను. ఆ నీరు, బిందు, చెల్విల ఆగమనం నా విల్‌పవర్‌ని అధికంచేశాయి. నాకు ధైర్యం వచ్చింది. వెంటనే మాయమైపోయాయి ఆ క్షుద్రశక్తులన్నీ.

***

తెల్లవారింది. రాత్రి జరిగిన సంఘటన విని షాడో, ముఖేష్, శ్రీకర్‌లు ఎంతో బాధపడ్డారు.

చెల్వి, బిందు ఆ రాత్రి అంతా ఒక స్నేహితురాలి యింట్లో గడపాలని ప్రోగ్రాం. ఎందుకో బిందుకు యింటికి రావాలని అనిపించిందట. ఆ కోరికను అణుచుకోలేక అర్థరాత్రి పరిగెత్తుకుంటూ వచ్చింది. ఆమె రాకపోయినట్లయితే నేను తప్పకుండా మరణించి వుండేవాడిని.

అంతా విని చెల్వి ఖంగారు అంతాయింతా కాదు. వెంటనే మద్రాసుతిరిగి పోదాం అంటూ కూర్చుంది.

ఆమెకు షాడో సీక్రెట్ ఏజెంట్ అని తెలియదు. నేను ఊరికే కూర్చోలేక అటువంటి పాడు పనులు చేస్తున్నానని ఆమె అభిప్రాయం.

సి.ఐ.బి. సంగతి చెప్పకుండా కొంతవరకూ జరిగిన సంగతులను వివరించి సమాధాన పరిచేసరికి నా తల ప్రాణం తోకకు వచ్చింది.

ఆ రాత్రి మళ్ళీ మరొక ప్రయత్నం చేశాను. ఆరోజు రాత్రి ఎనిమిది గంటలకు పరిశోధనా ఫలితాలను ఒక కవర్‌లో పెట్టి సీల్ చేసి ట్రాంబేలోవున్న అణువుత్పాదక కేంద్రానికి పంపించబోతున్నారు.

లేబరేటరీలో సీలు వేయబడిన కవరు తిరిగి ట్రాంబేలోనే తెరవబడుతుంది. అక్కడినించి ఆ రహస్యాలు బయటకు పొక్కకుండా విపరీతమైన కట్టుదిట్టాలు చేయబడ్డాయి.

ఎనిమిది గంటలకల్లా ఆత్మస్వరూపంలో లాబరేటరీల దగ్గిరికి వెళ్ళాను నేను.

ఒక పెద్ద హాలులో పదిమంది సైంటిస్టులు, ప్రభుత్వాధికారులు_ అందరూ కలిసి కవర్‌ని సీల్ చేయటం చూశాను.

దాన్ని ఒక యినుప పెట్టెలోపెట్టి బయటకు తీసుకువచ్చారు పాతికమంది సైనికుల మధ్య ఆ పెట్టెను వుంచి వారందర్నీ ఒక విమానంలో ఎక్కించారు.

సెక్యూరిటీ అధికారులు, సైనికులు అందరూ చూస్తుండగా విమానం గాలిలోకి లేచింది.

అది గాలిలోకి లేచిన మరుక్షణం ఒక ఆత్మస్వరూపం విమానంలోకి ప్రవేశించింది. విమానం వెనుకగా ఎగురుతున్నాను నేను అది గమనించి వెంటాడాను.

విమానం రాత్రి పన్నెండు గంటలకు ట్రాంబే చేరుకుంది. వందమంది సైనికులువచ్చి యినుపపెట్టెను అణువుద్పాదక భవంతులలోకి తీసుకుపోయారు.

ఆ ఫార్ములాను చదివి అటువంటి సాధనాలు తయారుచేసేదాకా భవంతులలోకి వెళ్ళిన యింజనీర్లు బయటికి రారు. వారికి కావల్సిన ఏర్పాట్లన్నీ లోపలే చేయబడతాయి. భవనం బయట అడుగుకు ఒక సైనికుడు మిషన్ గన్ తో నిలబడి వున్నాడు.

నేను అనుసరిస్తున్న ఆత్మస్వరూపి యినుప పెట్టెతో పాటు లోనికి వెళ్ళాడు. లోపల యింజనీర్ల జట్టు నాయకుడు పెట్టెను తెరిచి ఫార్ములాను చూశాడు. ఒక్కొక్క యింజనీర్‌ని పిలిచి అతను చేయవలసిన పనిని గురించి వివరంగా చెప్పాడు. ఫార్ములా మొత్తం పాతిక భాగాలు చేయబడింది. ఒక పని చేస్తున్న యింజనీర్‌కి తరువాతి విషయంగూర్చి తెలియదు.

యింజనీర్లకు ఎక్స్‌ప్లెయిన్ చేసిన మరుక్షణం ఫార్ములా కాగితాన్ని కాల్చి నుసిగా మార్చేశాడు ఆ అధికారి.

"ఫార్ములాను గురించి యిక ఎవరికీ తెలియదు. తెలుసుకోవాలంటే దేశభక్తుడైన ఆ అధికారిని వశపరుచుకోవాలి. అధి అసంభవం. యంత్రాలను తయారుచేసే యింజనీర్లను అందరినీ వశపరుచుకుంటేగాని మొత్తం ఫార్ములా తెలియదు.

అటువంటి కష్టాలు పడవలసిన అవసరం లేకుండానే అధికార ఫార్ములాను చదువుతున్నప్పుడే ఆ విషయాలన్నీ క్లియర్‌గా చూశాడా ఆత్మస్వరూపి.

వెంటనే వెనుతిరిగి ఉదయపూర్ బయలుదేరాడు.

కులకర్ణిగారు అన్న మాటలు నా చెవుల్లో మార్మోగటం ప్రారంభించాయి. ఆ వివరాలు పరాయివారికి అందితే చాలా ప్రమాదం. మరో రెండు మూడు నిముషాలలో అందబోతున్నాయి.

ఆ మాట అనుకోగానే నాలో ఎనలేని తెంపరితనం మొలకెత్తింది. ఆ ఆత్మస్వరూపిని అనుసరించటం మాని, ముందుకుపోయి కలబడ్డాను.

అతన్ని నాశనంచేస్తే ఆ విషయాలు బయటికి పొక్కవు.

నేను మీదపడిన మరుక్షణం అతను అసలు విషయాన్ని అర్థం చేసుకున్నాడు. నన్ను విదిలించికొట్టి పారిపోవటం ప్రారంభించాడు. అతన్ని పారిపోనీయటానికా నేను యిన్ని శ్రమలకు గురి అవుతున్నది? వెన్నంటాను.

అంతరిక్షంలో ఎవరూ కనీవినీ ఎరుగని ముష్టియుద్ధం ప్రారంభమయింది.

నా దెబ్బలకు సమాధానం యిస్తూనే అతను ఉదయపూర్ స్మశానాన్ని సమీపించాడు.

ఆ పరిసరాలను సమీపించిన మరుక్షణం అతని శక్తి అభివృద్ధి చెందింది. ఒక డేగలా మారి రివ్వున దూసుకుపోవటం ప్రారంభించాడు.

నేనేనా తక్కువ తిన్నది? రాబందు రూపం ఎత్తాను. అతను చిన్న చిలుక రూపం ధరించాడు. నేను కాకిగా మారి వెంటపడ్డాను.

ఉన్నట్లుండి అతను పెద్ద ఆక్టోపస్‌గా మారి తన తొండాలతో నన్ను బిగించిపట్టాడు. నేను ఎన్ని రూపాలు ఎత్తినా ఆ పట్టునుంచి బయటపడలేని ప్రమాదంలో చిక్కుపడ్డాను.

అదే సమయంలో ఎక్కడినుంచో చిన్న కందిరీగ దూసుకువచ్చింది. మా చుట్టూ రౌండ్లుకొట్టి ఛటాలున ఆక్టోపస్ కంటిమీదకుట్టింది.

బాధతో ఆక్టోపస్ పట్టు సడలిపోయింది. నేను బయటపడ్డాను. జ్యోతిర్మయ స్వరూపాన్ని స్మరిస్తూ క్షణక్షణానికి చిన్నదౌతున్న ఆ ఆక్టోపస్‌ని బిగించి పట్టుకొని నా భౌతికకాయం వున్న చోటికి తిరిగివచ్చాను.

నన్ను రక్షించిన ఆ కందిరీగ ఎవరో తెలీలేదు. నా కృతజ్ఞతలు తెలియపరుచుకునేఅవకాశంలేదు.

గదిని సమీపించటం నా భౌతిక కాయంలో ప్రవేశించటం క్షణాలమీద జరిగిపోయింది.

జ్యోతిర్మయ చక్రం పక్కగా వుంచిన జ్యోతికి నమస్కరించి అక్కడ వుంచిన కుంకుమను ఆ ఆక్టోపస్ మీద చల్లాను.

పూజచేసి పవిత్రం గావించబడిన కుంకుమ అది. అది తగిలేసరికి ఆక్టోపస్ బాధతో అరిచింది.

మాలినీ మంత్రాన్ని ఉచ్చరిస్తూ పరిశుద్ధ జలాన్ని దానిమీద చిలకరించాను.

భగ్గుమని మంటలు వెలువడ్డాయి. క్షుద్రశక్తులను ఆరాధించి అటువంటి శక్తులు సంపాదించిన ఆ ఆత్మస్వరూపి భస్మం అయిపోయాడు. అతను మరణించినట్లే లెక్క.

ఫార్ములా విషయం మరెవ్వరికీ తెలియదు.

నా పని పూర్తి చేసుకొని పక్కకు తిరిగేసరికి అంతవరకూ జ్యోతిర్మయ చక్రంలో పడుకొని నిద్రపోతున్న షాడో నవ్వుతూ లేచి కూర్చున్నాడు.

అప్పుడు నాకు అర్థం అయింది. కందిరీగగా వచ్చింది ఎవరోకాదు, షాడో. అది వరలో మాలినీ మంత్రం గురించి కొంత తెలుసుకొని వున్నాడు. అయితే ఆత్మస్వరూపంలో పది పదిహేను నిముషాలకంటె ఎక్కువ సేపు వుండలేడతను.

నేను పూజిస్తున్న జ్యోతిర్మయ స్వరూపం, నా రక్షణ కోసం షాడోని పంపించింది. లేకపోతే అతను రావటం ఎలా సంభవిస్తుంది?

***

మరునాటి వుదయం జరిగినదంతా కులకర్ణిగారికి రిపోర్టు చేసాను.

“మధూ! ప్రస్తుతానికి ఒక ప్రాబ్లమ్ సాల్వ్ అయిపోయింది. కాని యిదే తంతు తిరిగి ప్రారంభం కాదని నమ్మక మేముంది?” అన్నారాయన.

నిజమే! ఈ పురాణం వెనుక వున్న వ్యక్తి ఎవరు?

ఆ విషయంతెలుసుకోవటం ఏమంత కష్టం కాదనిపించింది నాకు.

షాడో వంక చూశాను. అర్థం చేసుకున్నాడు షాడో. ఆ క్షణమే హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయపూర్ వెళ్ళాడు.

ఆత్మస్వరూపిని చంపటం ప్రత్యర్థికి భయాన్ని కలిగిస్తుందని నాకు తెలుసు. అదే జరిగింది.

పధారియా అనబడే జోడియా దేశపువ్యక్తి ఉదయపూర్ శ్మశానపు సమీపాల్లో తిరగటం చాలా మంది చూశారట. అతను ఆరోజు వుదయమే జోడియా వెళ్ళిపోయాడట.

షాడో తిరిగి వచ్చాడు. జోడియా వెళ్ళి ఆ పధారియాను హతమార్చకపోతే లాభం లేదని తెలుస్తూనేవుంది.

నేను వంటరిగా వెళదామని అనుకున్నాను. కాని కులకర్ణిగారు షాడోని నాతో బయలుదేరమని ఆర్డర్స్ చేశారు.

ఇక చెల్వి సరేసరి... నాతోపాటు జోడియా రావటానికి సిద్ధపడింది. సంధ్య చీకట్లు ముసురుకుంటుండగా కులకర్ణిగారి బంగ్లా వెనుక భాగంలో వున్న తోటలో కూర్చుని చేయవలసిన పనులను గూర్చి చర్చించుకున్నాము.

జోడియా హిందూ మహాసముద్రంలో వున్న ఒక చిన్న దీవి. అక్కడి ప్రజలలో ఒక జాతివారు యిటువంటి మంత్ర తంత్రాలను ప్రాక్టీస్ చేస్తారు. అయితే యీ విషయం అందరికీ తెలియదు.

తెలిసిన వారు మాత్రం ఆ దీవిని టెర్రర్ ఐలండ్ అంటారు. ఎందుకంటే అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని చూడటానికి పోయిన టూరిస్టులలో ధనవంతులైన వారు తమ తమ దేశాలకు తిరిగి వచ్చిన మరుక్షణం పిచ్చివాళ్ళైపోయారు.

కారణం ఏమిటో ఎవరికీ తెలియదు.

***

"మధూ! జోడియా యింకా వందమైళ్ళ దూరం మాత్రం వున్నది." పైలట్ కాబిన్ లోనుంచి పెద్దగా అరిచాడు షాడో.

కునికిపాట్లు పడుతున్న నేను, ఉలిక్కిపడిలేచి కూర్చున్నాను. నాలుగు రోజులనుంచీ రాత్రిళ్ళు సరిగ్గా నిద్రలేకపోవటం, పగలంతా విపరీతమైన ఆలోచనలతో కాలం గడపటం, నా మెదడును కందిరీగల తుట్టెలా తయారుచేశాయి. రెండు క్షణాలపాటు ఏమీ అర్థం కాలేదు.

"మధూ..." అంటూ నా భుజం పట్టుకొని కుదిపింది చెల్వి.

ఆమె మాటతో పూర్తిగా మెలుకువ వచ్చింది. మెలకువతోపాటు ముందు ముందు ఎదుర్కొనవలసిన సమస్యలు మనసులో మెదిలాయి. నీరసం నిలువెల్లా ఆవరించుకోగా అలాగే సీటులో వాలిపోయాను.

గంటకు వందమైళ్ళ వేగంతో ఎగురుతున్నది మేము ప్రయాణిస్తున్న డకోటా. ఓటి డబ్బాలలో గులకరాళ్ళు పోసి మ్రోగించినట్లు డబ డబమని వికృత శబ్దాలు చేస్తోంది.

కావాలనే ఆ డొక్కు విమానాన్ని ఎన్నుకున్నాము. ఆధునికమైన జెట్ విమానంలో ప్రయాణంచేస్తే జోడియా పౌరులకు కుతూహలం కలిగించిన వారిమౌతాము. ఆ కుతూహలం ఇన్వెస్టిగేషన్స్ లోకి దిగితే మేము తలపెట్టిన పని గోవింద కొడుతుంది.

"ఇంకో అరగంటలో జోడియా భూభాగం మీదికిపోతాం." మరోసారి అరిచాడు షాడో.

అతని అరుపు కాబిన్ లో ప్రతిధ్వనించటం పూర్తి కాకముందే, రాక్షస హస్తమొకటి పట్టుకున్నట్లు విమానపు వేగం తగ్గిపోయింది.

"డామిట్! డర్టీ రోగ్... బ్లడీ ప్లేన్!!" అని తిడుతున్నాడు షాడో. పదినిముషాలు తంటాలుపడి విమానాన్ని కంట్రోల్ చేయగలిగాడు.

రెండు నిముషాలు కూడా ప్రయాణించలేదు. అంతలోనే ఎదురుచూడని ఆటంకం ఏర్పడింది.

ఎక్కడినించో ఒక రాబందుల గుంపు శరవేగంగా వచ్చి విమానాన్ని చుట్టుముట్టింది. రెండు రాబందులు ప్రొఫెల్లర్ల మధ్య పడి తునాతునకలైపోయాయి.

వాటి మధ్యనుంచి విమానాన్ని క్రిందికి దించేయాలని షాడో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

ప్రొఫెల్లర్ల మధ్యపడి మరణించిన రాబందులు మద్య చస్తూ మమ్మల్ని కూడా చంపినంత పనిచేశాయి.

ప్రొఫెల్లర్ల ఏమాత్రం ఆటంకం ఏర్పడినా ఇంజన్లు పాడయిప పోయాయి.

మా విమానానికి కూడా అదే గతిపట్టింది. కన్నుమూసి కన్నుతెరిచేటంతలో తల్ల కిందులుగా పల్టీలు కొడుతూ సముద్రంలో కూలిపోయింది. క్షణాల మీద నీటిలో పడి సముద్రాంతర్భాగానికి చేరుకొన్నది.

కొన ప్రాణాలతో విమానంలో నుంచి బయటపడగలిగాం. అయితే మా సామాన్లు, సరంజామా అంతా విమానంతో పాటు సముద్రం పాలయిపోయింది.

చెల్వికి చేయి అందించి తీరం వైపు యీత మొదలు పెడుతూ నావంక చూసి నవ్వాడు షాడో.

బదులుగా కనీసం చిన్న చిరునవ్వు నవ్వాలని ప్రయత్నించాను లాభం లేకపోయింది.

నా మనస్సునిండా పధారియా నిండి వున్నాడు. జరిగిన ప్రమాదానికి కారకుడు అతనేమో అన్న అనుమానం నన్ను చెదపురుగులా తొలుస్తున్నది.

రాబందులు. కాకులు, నక్కలు, తోడేళ్ళు మొదలైన క్షుద్రజీవులను మంత్రశక్తులతో వశపరచుకొని, కావల్సిన పనులు చేయించవచ్చు.

అతడు మరొక సంగతి తెలుసుకోవాలనే రాబందులను మా మీదికి పంపకం చేయలేదు గదా!!!

"మధూ! భయం వేస్తోందా!" నవ్వుతూ అడిగాడు షాడో. సమాధానం యివ్వలేదు నేను.

"వాట్ మాన్! ఇటువంటి సంఘటన లెన్నిటినో నువ్వు నవలల్లో చిత్రీకరించావ్... ఇంతకంటే వెయ్యి రెట్లు ప్రమాదకరమైన పరిస్థితులలో నుంచి నువ్వు సృష్టించిన హీరో బ్రతికి బయటపడ్డాడు. టేకిట్ యీజీమాన్... కాస్సేపు యిది కూడా ఒక కథే అనుకో!"

పదారియా మాకోసం ఎదురు చూస్తూ వున్నాడేమో అన్న అనుమానం కలుగక పోయినట్లయితే తప్పకుండా అది ఒక కథే అనుకునే వాణ్ణి కాని అలా కాదే!

నా ఆలోచనలు బయల్పరచకుండా నాలోనే దాచుకొని, స్విమ్మింగ్ మీద దృష్టిని కేంద్రీకరించాను.

పది మైళ్ళ దూరం యీదేసరికి నా పని అయిపోయి ఏదో కాలుమీద కాలువేసుకొని, తాపీగా నోటికివచ్చిన నవలలు వ్రాస్తూ, చీకూ చింతాలేనీ యీజీ లైన్ అలవరుచుకున్నాను. అది తప్పని యిప్పుడు వచ్చింది.

కాలేజీలో ఆటలనీ, పాటలనీ ఏదో ఒక విధంగా కాస్తో కూస్తో వ్యాయామం చేస్తున్నది చెల్వి. ఆమె ఫీల్ కావటం లేదు. ఇక షాడో_ దుర్మార్గుడు.

మామూలు మనిషి కాదు. ఉక్కుమనిషి, ప్రతిక్షణం ఏదో ఒకదాన్ని ఎదుర్కుంటూ రోజుకు నాలుగుసార్లు చావుబతుకుల మీద సవాల్ చేస్తూ వుండటం వల్ల అతని అవయవాలు, అంతరంగం_ రెండూ బండ రాళ్ళుగా మారిపోయాయి. మరో వందమైళ్ళు యీదమన్నా అవలీలగా యీదుకొనిపోగల సూపర్ మాన్ అతడు.

“మధూ! అలుపు వస్తున్నదా! నాభుజం పట్టు అంటూ నా పక్కకి వచ్చింది చెల్వి.

నాకు పౌరుషం పొడుచుకు వచ్చింది. దిసీజ్ టూ మచ్ అనుకుంటూ పెదవులు బిగించి, ఆయాసాన్ని అణుచుకోవాలని ప్రయత్నంచేస్తూ, బలవంతానా బారలు వేయటం ప్రారంభించాను.

మరో అరగంట తరువాత నాపని పూర్తిగా అయిపోయింది. అభిమానం చంపుకొని షాడో సహాయం అడుగుదామని నోరు తెరిచాను.

అదే సమయంలో దూరంలో నల్లటి వస్తువొకటి నా కంట పడింది. యీత ఆపి పరిశీలించి చూశాను.

చిన్న సైజు మోటార్ బోటు అది. మావేపే శరవేగంగా దూసుకు వస్తోంది.

మా విమానం కూలిపోవటం తీరం మీది నుంచి ఎవరో చూసినట్లున్నారు హెల్ప్ వస్తోంది.

పది నిముషాలలో మమ్మల్ని సమీపించింది ఆ బోట్. ముందు నిలబడివున్న ఇద్దరు దృఢకాయులు చేతులు అందించి మమ్మల్ని బోటు మీదికి చేర్చారు.

"సరదాగా చేపలు పడదామని వచ్చాం. మీ విమానం కూలి పోవటం చూసి యిటు బయలుదేరాం..." నల్లగా, పొట్టిగా వున్న దృఢకాయుడొకడు మమ్మల్ని కాబిన్ లోకి ఆహ్వానిస్తూ అన్నాడు.

నల్లటిపాంటు, నల్లటి షర్టు వేసుకొని వున్నాడతను. పేరు పీటర్స్ అని చెప్పాడు. అతనే ఆ బోటు యజమాని.

అతనిచ్చిన పొడి దుస్తులు ధరించి డెక్ మీద పచార్లు చేయటం ప్రారంభించారు చెల్వి, షాడోలు.

అలసిపోయిన అవయవాలకు విశ్రాంతి యిస్తూ నేను కాబిన్ లోనే వుండిపోయాను. పీటర్స్ ఇంజన్ గదిలోకి వెళ్ళాడు.

అతనితో మాట్లాడుతున్నంత సేపూ నాలో ఏదో చెప్పరాని ఉద్వేగం కలుగుతున్నది. అతను నిలబడిన ప్రదేశంలో కాలు బెడితే _ శరీరం మంచు నీటిలో జలదరిస్తున్నది.

ఏదో పొరపాటు జరిగింది. అది మాత్రం ఎక్కడ? ఎలా?

నన్ను ఎవరూ డిస్టర్బ్ చేయలేదు. బోటు తీరానికి చేరుకుంది. అక్కడినుంచి ఒక చిన్నవాన్ లో తన నివాసానికి పిలుచుకుపోయాడు పీటర్స్.

"మిస్టర్ మధూ! భారత దేశంనుంచి మీకు సహాయం వచ్చేదాకా మీరు నా అతిథులు!" అన్నాడు.

అభ్యంతరం చెప్పటానికి ప్రయత్నించాను. సీరియస్‌గా చూసింది చెల్వి. ఆమెకు పీటర్స్ మీద సదభిప్రాయం పడిందని తెలుస్తూనే వుంది ఇక నా మాట చెల్లుబడి అయ్యే అవకాశం ఏది?

నోరు మూసుకున్నాను. రాజ భవనంలాంటి పురాతన బంగ్లా పీటర్స్‌ది. దాని ప్రక్కనేవున్న చిన్న గెస్ట్ హౌస్ మా కోసం కేటాయించాడు.

అక్కడి వస్తువులన్నీ అతి పురాతనమైనటువంటివి ఎంతో అందంగా వున్నాయి. అవన్నీ చెల్విని యిట్టే ఆకట్టుకున్నాయి.

మెత్తటి పాన్పుల మీద కూర్చుని మార్గాయసం తీర్చుకుంటున్నాము. పీటర్స్ పిలుస్తున్నాడని అక్కడ సేవకులు వచ్చి ఎనౌన్స్ చేశారు.

అప్పుడుగాని మాకు టైం ఎంతయిందీ తెలియలేదు. మాకు తెలియకుండానే చీకటి పడింది. మాకు తెలియకుండానే భోజనపు వేళ అయింది.

పీటర్స్ సప్లయిచేసిన దుస్తులు ధరించి బయలుదేరబోతుండగా అతనే గెస్ట్ హౌస్ లోకి వచ్చాడు.

“థాంక్యూ వెరీ మచ్ మిస్టర్ పీటర్స్... మీ ఆతిధ్యం మరుపురానిది. మీ భవనం చాలా అందంగా వున్నది”. కామెంట్ చేసింది చెల్వి.

ఉబ్బిపోయాడు పీటర్స్. “మేడమ్... మీరు చూడవల్సినవి యింకా చాలా వున్నాయి... మీల్స్ అయిన తర్వాత మీకు అభ్యంతరం లేకపోతే నా లైబ్రరీ చూపిస్తాను”. అన్నాడు అందంగా వంగి విష్ చేస్తూ.

చెల్వి ముఖం వికసించింది. ఆమెకు పుస్తకాలు వుంటే మరి ఏమీ అక్కరలేదు. అసలు మా యిద్దరికీ పరిచయం అయింది ఆ పాడు పుస్తకాల మూలంగానే.

డిన్నర్ ముగిసింది. షాడో పొలైట్‌గా గుడ్ నైట్ చెప్పి విశ్రమించటానికి వెళ్ళిపోయాడు. మేమిద్దరమూ చేరితే వ్యవహారం అలానే వుంటుంది. లీడర్ ఎవరో

ముందే సెటిల్ అయిపోతుంది. అతను నాయకుడు అయితే నేను గమ్మున వుంటాను. నేను లీడ్ చేస్తుంటే అతను గప్ చుప్. మా యిద్దరి ఫ్రెండ్ షిప్ లోనుంచి వెలువడిన ఒక అందమైన అండర్‌స్టాండింగ్ అది.

లైబ్రరీ చూడటానికి బయలుదేరింది చెల్వి. అది నాకు యిష్టంలేదు. "డోన్ట్ బీ సిల్లీ..." లోగొంతుకతో హెచ్చరించిందామె నా అభ్యంతరాన్ని విని.

విధిలేక నేను కూడా శలవు పుచ్చుకున్నాను. గెస్ట్ హౌస్‌కి తిరిగివచ్చి బెడ్ మీద మేను వాల్చాను. నిద్రరాలేదు. పన్నెండు గంటలకు చెల్వి తిరిగి వచ్చింది.

"మధూ! నీ అనుమానాలు నాకు తెలుసు. కాని, కనపడిన ప్రతి మనిషినీ అనుమానించటం మొదలుపెడితే జీవించటం చాలా కష్టం అవుతుంది. ఎన్నడూ లేనిది నువ్వు అసూయకు గురి అవుతున్నావని అనిపిస్తోంది"

సిగ్గుతో నా తల వాలిపోయింది.

అసూయ పడుతున్నానా? చెల్వి యింకో మగవాడితో మాట్లాడటం నాకు యిష్టంలేదా? తరచి తరచి ప్రశ్నించుకున్నాను. పీటర్స్ మీద నాకు సదభిప్రాయంలేదు. అందువల్ల చెల్వి అతనితో చనువుగా ప్రవర్తించటం నాకు బాధగా అనిపిస్తోంది.

"నాన్సెన్స్... అర్థం లేకుండా మాటాడకు, ముక్కూ ముగం తెలియని ఒక పరదేశి ప్రాణాలు కాపాడి, ఆశ్రయమిచ్చినందుకు సంతోషించక, అతన్నే అనుమానిస్తున్నావు మధూ... రానురాను నువ్వు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తున్నావ్. పీటర్స్ ఒక జంటిల్మన్" కుండ బద్దలు కొట్టినట్లు నా ముఖం మీదే చెప్పి పడక మీద మేను వాల్చింది చెల్వి.

నా మనస్సు కలత బారింది. యీ పాడు ఎస్సైన్‌మెంట్ ఎందుకు టేకప్ చేశాను అనిపించటం ప్రారంభించింది.

"ఏమండోయ్! మంత్ర వేత్తగారూ... నిద్రలేవండి. యిప్పుడు పగలు పన్నెండు గంటలు అయింది" అంటూ చెల్వి మేల్కొలుపులు ప్రారంభించగానే ఉలిక్కిపడి లేచి కూర్చున్నాను.

సోఫాలో కూర్చున్న షాడో నన్ను చూసి చిరునవ్వు నవ్వాడు. నా మూడ్ కాస్త మెరుగయింది.

"మధూ! జోడియాలో ఏదో వుంది వుంది అంటూ వచ్చాం. యిక్కడ ఏమీలేదు." నా ఎదురుగా కూర్చుంటూ అన్నది చెల్వి.

ఆ మాటలు నాకు అర్థం కాలేదు.

"ఉదయం ఎనిమిది గంటలకు పీటర్స్‌తో మాట్లాడాను. అసలు మంత్ర తంత్రాలంటే అతనికి నమ్మకం లేదట. జోడియాలో నువ్వు చెప్పే విషయాలు నడవటానికి వీలు లేదట."

కోపంతో నా ముఖం ఎర్రబడింది. షాడో వైపు చూశాను తొందర పడవద్దని కన్ను గీటాడు.

"పీటర్స్ మాటలు వింటుంటే_ నువ్వులేని పోనివి వూహించుకొని చిన్న విషయాన్ని పెద్దదిగా చేస్తున్నావని అనిపిస్తోంది మధూ!" అన్నది చెల్వి. ఆమెలో నాకునచ్చే గుణాల్లో అదొకటి. మనసులో వున్నమాట వున్నట్లే బయట పెట్టేస్తుంది. కాని ప్రస్తుతం అదే నాకు కోపానికి కారణం అయింది. జవాబు యిద్దామని నోరు

తెరిచాను. మళ్ళీ సైగ చేశాడు షాడో. "తొందర పడకు. నిదానించి ఆలోచించు" అని అర్థం ఆ సైగకు.

తెరిచిన నోటిని ఠక్కున మూసుకొని బాత్ రూమ్ వైపు అడుగులు వేశాను.

చెల్వి కోసం జోడియా దేశపు దుస్తులు తెప్పించాడు పీటర్స్ నేను కాలకృత్యాలు తీర్చుకొని బాత్ రూమ్ నుంచి బయట పడేసరికి ఆమె అతనితో జోడియా నగరం చూడటానికి బయలుదేరింది.

ఆపే అధికారం నాకు లేదు. ఎంత వద్దని అనుకున్నా నా గుండెల్లో ఏదో చెప్పరాని బాధ ప్రారంభమయింది.

అసూయ అంటే అదేనా?

"మధూ? ప్రస్తుతం మనం చేస్తున్న పని బయటకు చెప్పరానిది. చెప్తే మనల్ని పిచ్చివాళ్ళని వెక్కిరిస్తారు అందరూ. ఆ అందరి లాగానే చెల్వి కూడా మాటలాడుతున్నది. నవ్వి వూరుకోక ముఖం ముడుచుకుంటావేమిటి మాటల్లో చెబితే యీ విషయం ఆమెకు అర్థం అవుతుందా!" నా మూడ్‌ని పసికట్టిన షాడో నన్ను అనునయించాడు.

గట్టిగా నిట్టూర్చి పక్కమీద మేను వాల్చాను. రాత్రికి నిద్దుర వుండదు. ఎలాగైనా సరే... యీ రాత్రికి మా బాధలకు మూల కారకుణ్ణి పట్టేయాలి.

చీకటి పడబోతుండగా చెల్వి పీటర్స్ తిరిగి వచ్చారు.

"బ్యూటీఫుల్ సిటీ మధూ! ఫాదర్‌తో చెప్పి యిక్కడ ఒక ఎస్టేట్‌ని ఖరీదు చేయించాలని వుంది ఏమంటావ్?" అలసటగా నా ప్రక్కన కూర్చుంటూ అన్నది చెల్వి.

డిన్నర్ అరేంజి చేయించటానికి పోయాడు పీటర్స్. నా ఆలోచనలో పడి చెల్వి మాటలకు సమాధానం యివ్వలేకపోయాను.

అదో మాదిరిగా చూస్తూ అవతలికి పోయిందామె. అలాగే మరో రెండు రోజులు గడిస్తే నేనంటే ఆమెకు దురభిప్రాయం ఏర్పడటం తప్పనిసరి అని అంగలార్చింది నా అంతరాత్మ.,

వాట్ కెనై డూ ఎబౌట్ యిట్? ఏం చేయగలను?

డిన్నర్ ముగిసింది. నా మంచాన్ని ఇవతలికి లాగి నేలమీద పది అడుగుల స్థలాన్ని క్లియర్ చేశాను. ఆ తర్వాత నా శరీరానికి కాపలా వుండేటందుకు సిద్ధపడుతున్నాడు షాడో.

పదకొండు గంటలకు చెల్వి వచ్చింది. షాడోతో రెండు మాటలు మాట్లాడింది. నాతో ఏమీ మాటాడలేదు. నాతో మాట్లాడాలనే ప్రయత్నిస్తున్నట్లు నాకు అర్థం అయింది. కాని అందుకు వ్యవధి లేదు.

పన్నెండు గంటల లోగా నా పని నేను ప్రారంభించాలన్న పట్టుదలతో వున్నాను.

అదే సమయంలో చిన్న వెండి పళ్ళెరం నిండా ఏవో తీపి మిఠాయిలు నింపుకొని మా గదిలోకి వచ్చింది పదహారేళ్ళ బాలిక.

ఆమెను చూడగానే నా మెడమీద వెంట్రుకలు నిక్క బొడుచుకున్నాయి. తెల్లగా రక్తం లేనట్లు పాలిపోయివుంది ఆమె ముఖం. ఆమె కళ్ళల్లో జీవంలేదు. చనిపోయిన వారి చూపులు అలాగే వుంటాయి.

నాలో అనుమానం వెర్రి తలలు వేసింది.

నా మంచం ప్రక్కనే వున్న మంచినీటి జగ్‌ని తీసుకొని కుడిచేతిలోకి కొద్దిపాటి నీటిని వంపుకున్నాను.

నా చర్య అతి సాధారణమైనది. చెల్వి షాడో యిద్దరూ పట్టించుకోనే లేదు.

ఆ బాలిక మాత్రం భయంగా ఒక అడుగు వెనక్కు వేసింది. జ్యోతిర్మయ స్వరూపాన్ని తలచుకొని ఆ సీసా ఆమె మీదికి విసరబోయాను.

మరుక్షణం వెర్రిగా అరిచిందామె చేతిలోవున్న పళ్ళెరాన్ని అవతలికి విసిరి బయటికి పారిపోయింది.

నేను చేయి ఎత్తటం చెల్వి గమనించింది. నా చేతి నుంచి జారి క్రింద పడిన నీటిని చూసింది.

కోపంతో ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది. చటాలున ముందుకు వచ్చి బలంగా నా చెంప మీద కొట్టింది.

“యూ అన్ సివిలైజ్ బ్రూట్... నిద్ర పోయేముందు యిక్కడి వారు తీసుకునే తీపి పదార్థాలు అవి. రుచి చూపించమని చెప్పి పంపించాడు పీటర్స్. నీ పాడు చేష్టలతో అతన్ని అవమానిస్తున్నావ్... దిసీజ్ టూ మచ్ మధూ.

ఐ హేట్ యూ... ఐ హేట్ యూవర్ అగ్లీ థాట్స్... ఆ హేట్ యువర్ ప్రజెన్స్... నీతో రావటం బుద్ధి తక్కువ అయింది” అన్నది ఆవేశం నిండిన కంఠంతో.

నేను సమాధానం యిద్దామని అనుకుంటుండగా పీటర్స్ స్వయంగా అక్కడికి వచ్చాడు. అంతా విన్నాడనే నా అనుమానం.

"మరేం ఫర్వాలేదు మేడమ్... అనవసరంగా బాధ పడకండి. మీ స్నేహితుడు ఏదో వూహించుకొని అలా ప్రవర్తిస్తున్నాడు. రేపు మంచి సైక్రియాటిస్ట్‌కి చూపించి ట్రీట్‌మెంట్ యిప్పిద్దాం. అంతా సర్దుబాటు అవుతుంది." అన్నాడు చెల్విని అనునయిస్తూ.

అతని చెయ్యి చెల్వి భుజం మీద పడటం చూడగానే నా గుండెల్లో ఎర్రగా కాల్చిన యినుప చువ్వ దిగినట్లు అనిపించింది.

యస్... ఇదీ అసూయ! నేను వప్పుకుంటాను, కాని అదే సమయంలో అతను చెల్విని స్పృశించటం చూసి అసూయ ఒక్కటే కాదు... చెప్పరాని భయం కూడా కలిగింది నాలో.

నేను వెతుకులాడదామని అనుకుంటున్న వ్యక్తి... ఎక్కడో కాదు యిక్కడే, నా ముందే వున్నాడు. ఆ విషయం నాకు ఖచ్చితంగా తెలిసి వచ్చింది.

అది కాకపోతే_ చెల్వి అన్నట్లు పీటర్స్ అభం శుభం తెలియని ఒక జంటిల్మన్ అయివుంటే _ జాంబీలతో పనులు చేయించుకోవటం దేనికి?

అంధకార శక్తులను ఆరాధించి వాటి అనుగ్రహానికి పాత్రులైన వారు దేవుడితో సమానమైన శక్తులు కలిగి వుంటారు.

చనిపోయిన మనిషి ఆత్మను అంధకార శక్తులకు అర్పిస్తే _ అవి చనిపోయిన మనిషి శరీరానికి ప్రాణం పోస్తాయి. ప్రాణం మాత్రమే... అటువంటి జాంబీలు అంటారు. మానవ సహజమైన అనుభవాలు వారికి వుండవు యంత్రపు మనిషిలా పని చేయటంతప్ప మరొక సంగతి వారికి పట్టదు.

పీటర్స్ పంపిన బాలిక ఒక జాంబీ! ఆమె తెచ్చి మిఠాయిలు క్రింద చెల్లా చెదురు పడివున్నాయి.

పీటర్స్ మాటలు విని విసురుగా బయటికి వచ్చేశాను. వస్తూ వస్తూ ఒక మిఠాయిని ఎవరూ చూడకుండా తీసుకువచ్చాను.

వరండాలో గోడను ఆనుకొని నిలబడి దాన్ని పరిశీలనగా చూశాను. తీపి వాసనతోపాటు మరో వింతవాసన వస్తోంది. రెండు క్షణాలు ఆలోచించాను. అర్థం కాలేదు.

నేను బయటికి వచ్చిన రెండు నిముషాలకు షాడో కూడా నన్ను అనుసరించి వచ్చాడు.

మిఠాయినిఅతని చేతికి అందించాను.

వాసన చూశాడు. "మైగాడ్! ఇందులో గంజాయి కలపబడి వుంది!" అన్నాడు అప్రయత్నంగా.

ఆమాట నన్ను అంతగా ఆశ్చర్య పరచలేదు. జాగ్రత్త పడేటట్లు చేసింది.

మరో పావు గంట తరువాత చెల్విని సమాధాన పరిచి వెళ్ళిపోయాడు పీటర్స్. "మధూ. రేపు పీటర్స్‌తో నేను కంబోడియా వెళుతున్నాను. అక్కడి నుంచి సరాసరి ఇండియా వెళ్ళిపోతాను." నేను లోనికి వెళ్ళగానే ఎనౌన్స్ చేసింది చెల్వి.

నేను ఆర్గ్యుమెంట్స్ మొదలుపెడితే నన్ను నోరెత్తనీయకుండా చేయటానికి సమాధానంగా సిద్ధపరుచుకునే అన్నది ఆమాట.

నేనేమైనా వెర్రివాడినా ఆర్గ్యూ చేయటానికి! ఆమె మీద నాకు ఏమీ అధికారం వుందని ఆర్గ్యూ చేస్తాను?

ఆ క్షణంలో ఆమె మీది అభిమానం, ప్రేమ మొదలైన వన్నీ నా గుండెల్లో నుంచి మాయమైపోయాయి.

"యూకెన్ డూ వాటెవర్ యూ వాన్ట్!" నిర్మోహమాటంగా చెప్పి బయటికి వచ్చేశాను.

ఎదురు చూడలేదు కాబోలు_ఆ సమాధానం వినేసరికి చెల్వి ముఖం చిన్నబోయింది. ఎగబీలుస్తూ మంచం మీదికి చేరింది.

"మధూ! పీటర్స్... యీ దురాగతాలకు మూలకారకుడే అంటావా?" మెల్లిగా అడిగాడు షాడో.

ఆ విషయంలో నాకు ఎటువంటి సందేహాలు లేవు. అవునన్నట్లు తల వూపాను. వెంటనే షాడో చేయి బూటులోని డాగర్ మీద పడటం గమనించి కళ్ళు అటు తిప్పాను.

ఆయుధాలతో పని సానుకూలం కాదు. షాడో డాగర్ విసిరేలోపుగానే పీటర్స్ షాడోని నిర్వీర్యుణ్ని చేయగలడు. ఆ విషయం షాడోకు కూడా తెలుసు.

"మరేం చేద్దాం మధూ! ఈ విషయాలలో నాకు అనుభవం లేదు. నేను చేతగాని వాణ్ణి అయిపోయాను" బాధగా వినవచ్చింది అతని కంఠం.

నా పెదవులమీద చిరునవ్వు వెలిసింది. షాడో ఏమీ చేయనవసరం లేదు. మౌనంగా నా ప్రక్కన నిలబడినా చాలు. ప్రపంచాన్ని జయించి రమ్మన్నా కళ్లు మూసుకొని బయలుదేరతాను.

“ఈ రాత్రికి పీటర్స్ ఏమీ చేయడు. అతను వండిన గంజాయి మిఠాయిలు మనం తినలేదు. మన మనుషులు క్లియర్‌గా వుంటారు. అందువల్ల ఈ రోజు ఆగి మరి ఏదైనా ప్రారంభించవచ్చు” అన్నాను.

అది తప్పని అప్పుడు తెలియలేదు. రాత్రి రెండు గంటలు కొట్టే వేళకు పీటర్స్ మనస్తత్వాన్ని ఎరిగి తప్పుగా అంచనా వేశానో_నాకు బాగా తెలిసి వచ్చింది. తెలిసి వచ్చేసరికి పరిస్థితి చేయి జారిపోయింది.

నామీద అలిగిన చెల్వి పక్కగదిలోకి వెళ్ళి పడుకున్నది. బహుశా నా ముఖం చూడటం కూడా ఇష్టం లేకుండా పోయిందనుకుంటాను.

అనవసరంగా ఆమెను వెంట బెట్టుకు వచ్చానే అని బాధపడుతూ నిద్ర పట్టక పక్కమీద పొర్లుతున్నాను.

గదిలో వున్న గోడ గడియారం ఠంగు ఠంగున పన్నెండు గంటలు కొట్టింది.

ఉన్నట్లుండి తలుపు తట్టిన శబ్దం వినవచ్చింది. వులిక్కి పడిఅటు చూశాను.

తలుపు గడియ వేయలేదు. మరో రెండుసార్లు శబ్దం వచ్చింది. తలుపులు తోసుకొని లోనికి వచ్చింది_ ఒక బాలిక మాకు మిఠాయిలు అందించిందామె.

అదిరిపడి లేచి కూర్చున్నాను మంచం మీద, తెరిచి వున్న తలుపును ఆనుకొని నిలబడి _ వికృతంగా నవ్వింది ఆమె.

నాకు ముచ్చెమటలు పోశాయి. పీటర్స్ వేసిన పథకం ఏమిటో నాకు అర్థం కాలేదు.

నవ్వుతూనే వున్నదామె. నా మెడమీద చల్లటి చలిగాలి సోకింది. శరీరంలోని రక్తం గడ్డకట్టుకు పోయినట్లయింది.

వెనుదిరిగాను. కర్టెన్లతో మూసివున్న కిటికీలోనుంచి తలలేని మొండెం ఒకటి లోనికి వచ్చి నిలబడింది.

వెనుక నుంచి జాంబీ నవ్వుతున్న వికృతపు నవ్వు దానికి అనుగుణంగా చేతులు కదిలిస్తున్న మొండెం...

నాకు కాళ్ళు చేతులు ఆడలేదు _ పెదిమలు ఎండిపోయాయి.

"రాజూ! రాజూ!" అంటూ షాడోని పిలిచాను. నా పెదిమలు మాత్రం కదిలాయి శబ్దం బయటికి రాలేదు.

మొండెం నా మంచం దగ్గిరకి వచ్చింది. పక్కకు జరిగాను. బాత్ రూమ్స్ వున్న దిశనుంచి _ మరొక ఆకారం గదిలోకి వచ్చింది.

ఈ ఆకారానికి చేతులు లేవు. నడుము దగ్గిర్నించి నాలుగు అడుగుల ఎత్తున తల మాత్రమే వుంది. ఒకే ఒక కన్ను... ఫుట్ బాల్ సైజులో వుంది.

కనుపాపను గుండ్రంగా తిప్పుతూ ఎగిరి గంతులు వేస్తూ నా సమీపంలోకి వచ్చిందది.

వెనక్కి జరిగి జరిగి మంచం మీది నుంచి క్రింద పడి పోయాను నేను.

మరుక్షణం ఎగిరి మంచం మీద నిలబడింది మొండెం.

జాంబీ బాలిక నవ్వుతున్న వికృతపు నవ్వు నా చెవులలో గింగిరు మంటున్నవి. అంత శబ్దం అయినా షాడో ఎందుకు లేవటం లేదో నాకు అర్థం కాలేదు.

మంత్ర తంత్రాలతో రక్షణ కల్పించుకోవాలి. కాని అందుకు సమయా సమయాలున్నాయి. నేను నేర్పిన విద్యలు ఆఖరి క్షణాల్లోగాని ఉపయోగించకూడదు.

దారిన పోయే దయ్యాన్ని చూసిన మరుక్షణం మంత్రాలను ప్రయోగిస్తే బెడిసి కొడతాయని.

క్రింద పడిన నా గుండెల మీదికి దూకింది శిర పిశాచి నా ముఖం మీదికి వంగి భయంకరంగా నవ్వింది.

అదే సమయంలో ఎగిరి మంచం మీదినుంచి క్రిందికి దూకాడు షాడో. అంతా చూస్తూనే వున్నట్లున్నాడు. మంచం కింద వదిలిన స్లిప్పర్ నొకదాన్ని చేత పట్టుకొని శిరపిశాచి వీపుమీద బలంగా బాదాడు.

ఎగిరి వెనక్కు దూకిందది, షాడో విజృంభించగానే నాకు ధైర్యం వచ్చింది. స్ప్రింగులా లేచి మొండెం గుండెల మీద తన్నాను. దాని కాళ్ళు దొరకబుచ్చుకొని బలంగా గోడకేసి కొట్టాను.

షాడో ముందు శిరపిశాచి ఆటలు సాగలేదు. కీచుగా అరుస్తూ వెనక్కి తగ్గి గాల్లో కరిగిపోయింది.

నేను వెంటపడిన మొండెం కూడా దాన్ని అనుసరించింది. తలుపులు దగ్గిరే నిలబడి వుంది ఆ జాంబీ బాలిక. నాకోపం హద్దులు దాటింది. అటు అడుగులు వేశాను.

నేను తనను సమీపించగానే కెవ్వున అరిచిందామె. ఈసారి ఆమె కంఠం చాలా సహజంగా వుంది.

‘‘అమ్మో... నాయనో... రక్షించండి... రక్షించండి’’ అని అరుస్తూ బయటికి పారిపోయింది.

ఆమె వెనుకే వరండాదాకా పరుగెత్తి ఆగిపోయాను నేను. పీటర్స్ బంగ్లాలోకి వెళ్ళి పోయిందామె.

అలా ఎందుకు ప్రవర్తించిందో తెలియక వెనుతిరిగి, రాతిబొమ్మలా నిలబడిపోయాను.

చెల్వి పడుకున్న గది తలుపులు తెరిచివున్నాయి. ద్వారంలో నిలబడి వున్నదామె.

‘‘మధూ! నిన్ను గురించి ఏమో అనుకున్నాను. గుళ్ళో కలుసుకున్నాను. ఒక అమాయకురాలి మీద యిలా అత్యాచారం మొదలు పెట్టేటంత నీచుడివి అని మాత్రం అనుకోలేదు.’’ అన్నది నిప్పులు వర్షిస్తున్న కళ్ళతో!

ఆ మాటలు విని షాడో వరండాలోకి వచ్చాడు.

‘‘చూడమ్మా చెల్వీ... జరిగిన విషయం_’’

అంతే ఆపైన అతని మాటలు చెల్వి వినలేదు. లోపలికి పోయి ధన్ మని తలుపులు మూసుకుంది.

‘‘మధూ! ఇంత వరకూ బిందు లాంటి కోపిష్టి యీ భూప్రపంచంలో లేదని అనుకున్నాను. కాని చెల్వి ముందు బిందు సూర్యుడి ముందు దివిటీ’’ అన్నాడు షాడో నావైపు తిరుగుతూ.

నాకు నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు. నీరసంగా బెడ్ వైపు అడుగులు వేశాను.

***

ఉదయం పది గంటలు కొట్టేసరికి ప్రయాణానికి సిద్ధమైంది చెల్వి. పీటర్స్ మా గదులకు రాలేదు. రాత్రి జరిగిన సంఘటనల గురించి ఏమైనా మాట్లాడతాడేమో అనుకున్నాను. అసలు మనిషే కనిపించలేదు.

పదకొండు గంటల దాకా చూసి అతని బంగ్లా వైపు బయలుదేరింది చెల్వి.

ఆఖరి సారిగా బ్రతిమిలాడదామని అనుకున్నాను.

"మధూ! చెల్వికి అలుసు యిచ్చి యిచ్చి యింత వరకూ తెచ్చావ్... పోయి రానీ ఏం జరుగుతుందో చూద్దాం!" అని నన్ను ఆపాడు షాడో.

పీటర్స్ బంగ్లాలోకి వెళ్ళింది చెల్వి. అరగంట... గంట గడిచింది. నాకు కాలు నిలవటం లేదు.

"ఎందుకలా గంతులేస్తావ్?" చిరాకు పడ్డాడు షాడో.

గంతులు వేయక ఏం చేస్తాను? మామూలు మనుష్యులు, ఎటువంటి రౌడీలు దగ్గిరికయినా చెల్వి వంటరిగా వెళితే నేను చలించను.

కాని పీటర్స్ సామాన్యుడు కాదు... అది చెల్వికి అర్థం కావటంలేదు. నేను ఆ ఆలోచనలలో వుండగానే పీటర్స్ బంగ్లాలోనుంచి కెవ్వుమని వినిపించింది ఒక కేక.

నా నవనాడులు స్తంభించి పోయాయి. చెల్వి కంఠం అది. మెరుపులా అటు దూకాను. నా కంటె నాలుగు అడుగులు ముందే వున్నాడు షాడో.

క్షణంలో బంగ్లాను సమీపించాము. ద్వారంలోకి ప్రవేశిస్తూ వుండగా చెల్వి ఎదురుగా వచ్చింది.

దుస్తులు చిరిగి వున్నాయి.... భయంతో వణికిపోతోంది. నన్నుచూడగానే వెక్కి వెక్కి ఏడుస్తూ వచ్చి గట్టిగా కౌగలించుకుంది.

“మధూ! పీటర్స్ నరరూప రాక్షసుడు... నువ్వు వెతుకుతున్న పధారియా వీడే... స్నేహితుడిగా నటించి నన్ను నాశనం చేయాలని చూశాడు” అన్నది భోరున... ఏడుస్తూ.

నా సమస్యలన్నిటినీ క్షణంలో తుడిచి పారేసిన పధారియాను మెచ్చుకోకుండా వుండ లేకపోయాను.

అదే సమయంలో ముందుకు వెళ్ళిన షాడో గిరుక్కున వెనుతిరిగి పరిగెత్తుకుంటూ వచ్చాడు.

“కమాన్ మధూ! మనం యిక్కడ నుంచి బయటపడాలి... భవనం అగ్ని ప్రమాదానికి లోనయింది.” అన్నాడు.

అప్పటికీ చిటపటలాడుతూ అగ్నిజ్వాలలు బంగ్లాను సగం వరకూ ఆక్రమించుకున్నాయి.

పోర్టికోలో పీటర్స్ అలియాస్ పధారియా కారు ఆగి వుంది. చెల్విని వెనుక సీటులోకి తోసి స్టీరింగ్ ముందు కూర్చున్నాను.

కారు ముందుకు కదిలిస్తుండగా... విజృంభిస్తున్న మంటలలోనుంచి ఒక ఆకారం యివతలికి పరిగెత్తుకుంటూ వచ్చింది.

దుసులన్నీ కాలి పోయాయి... శరీరం బొబ్బలెక్కిచూడరానంత అసహ్యంగా వుంది. బాధతో భయంకరంగా అరుస్తూ పోర్టికోలో పొర్లాడసాగింది.

ఎవరో కాదు. గతరాత్రి నన్ను ఏడిపించిన జాంబీ బాలిక.

ఆ దృశ్యం చూసే సరికి చెల్వి హృదయం కరిగి పోయింది. ఎంతలేదన్నా మెడికల్ స్టూడెంట్... చటుక్కున క్రిందికి దిగి ఆమెను కారులోకి చేర్చింది.

బంగ్లా అంతా అగ్ని జ్వాలతో నిండిపోయింది చుట్టు ప్రక్కలవున్న వారంతా అక్కడికి రాసాగారు. ఎక్కడినుంచో ఫైరింజన్లు వస్తున్న మోతలు వినిపించాయి.

పధారియా కోసం వెతకటానికి పోయిన షాడో తిరిగి వచ్చాడు. అతను కారు ఎక్కగానే ముందుకు పోనిచ్చాను.

"మధూ! ఏదైనా హాస్పిటల్‌కి పోనీ..." కమాండ్ చేసింది చెల్వి. జనరల్ హాస్పిటల్‌కి తీసుకు పోయాను.

జాంబీ బాలికకు ట్రీట్‌మెంట్ ముగిసి, ఆమెను బెడ్ మీదికి పంపేసరికి రెండు గంటలు పట్టింది. ఈ లోపల జరిగిన విషయం అంతా వివరంగా చెప్పింది చెల్వి.

నన్ను గురించి చాలా ఛండాలంగా వర్ణించి చెపుతూ ఆమెను ఒక గదిలోకి తీసుకుపోయాట్ట. కొద్దిసేపటి తర్వాత అతని ప్రవర్తన వింతగా తోచి అక్కడి నుంచి బయట పడటానికి ప్రయత్నించింది చెల్వి.

పెచ్చుమీరి పోయిన పధారియా బలాత్కరించటానికి ప్రయత్నించాట్ట. ఆ గొడవలో అటూ యిటూ పరిగెత్తుతూ లోపలి గదులలోని మంత్ర తంత్రాలకు సంబంధించిన సామాన్లను చూసింది... ఖంగారులలో ఒక గది మధ్య వెలిగించి వుంచిన జ్యోతులను తొక్కుతూ పారిపోయి వచ్చింది.

అగ్నిప్రమాదానికి కారణం అది. పధారియా మంటల్లో పడిమాడిపోతే బాగుండును అని ఆశించింది నా హృదయం.

కాని అతను బ్రతికేవున్నాడని... మమ్మల్ని ముప్పతిప్పలు పెట్టటాని పథకాలు సిద్ధం చేస్తున్నాడనీ నాకు తెలియదు.

***

చీకటిపడే సమయానికి జాంబీ బాలిక పరిస్థితి విషమించింది. తెల్లవారే లోపుగా మరణించటం ఖాయం అని తేల్చారు డాక్టర్లు.

ఆమె బెడ్ వున్న వార్డ్ ముందు కూర్చుని కునికిపాట్లు పడుతున్నాం మేము ముగ్గురం.

ఉన్నట్లుండి నన్ను లేపాడు షాడో. కళ్ళు తెరిచి అతను చూపించిన దిశకు చూశాను.

నలుగురు ముసుగు మనుష్యులు జాంబీ గదిలోకి ప్రవేశించారు. ఆమెను ఎత్తుకొని అవతలివైపు వున్న కిటికీలో నుంచి పారిపోవాలని ప్రయత్నిస్తున్నారు.

నన్నులేపి... అటు పరిగెత్తాడు షాడో. మంత్రాలు తెలియవు గాని, మిగిలిన విషయాల్లో షాడో ముందు నిలవ గలవారు చాలా తక్కువ మంది వున్నారు ఈ ప్రపంచంలో.

అతని పిడికిలి పోట్లకు ముసుగు మనుష్యులు అదిరిపోయారు... ఆ బాలికను గదిలోనే వదిలి ప్రాణాలు దక్కించుకొని పారిపోయారు. ఆ గలాటా విని హాస్పిటల్ అధికారులు అక్కడికి చేరారు. అప్పటికే అంతా అయిపోయింది.

అంతవరకూతల అటూ యిటూ కదిలిస్తున్న ఆ బాలిక క్రిందపడిన మరుక్షణం ప్రాణాలుకోల్పోయింది.

***

"మధూ! శవాన్ని హాస్పిటల్ అధికారులకే అప్పగించి పోదాం... దహన క్రియలు వాళ్ళే ఏర్పాటు చేస్తారు." అన్నది చెల్వి.

కాని నాకు ఆ సలహా నచ్చలేదు. అనుమానం నాది.

జోడియాలో దహనం చేసే ఆచారంలేదు. పాతిపెడతారు. పాతిపెట్టిన తరువాత పీటర్స్ మళ్ళీ ఆమెను బయటికి లాగి ప్రాణం పోస్తాడు. ఆ జీవికి ముక్తిలేదు. అలా కృంగిపోవాల్సిందే.

నా చేతుల్లో మరణించిందా బాలిక. నేను చూస్తూ వుండగా తిరిగి అటువంటి అఘాయిత్యం జరుగనిస్తావా?

నా ఆలోచనలు షాడో, చెల్విలకు వివరించాను. షాడో ఆలోచనలో పడ్డాడు.

"నో... అయితే మనమే తీసుకుపోయి ఎవరికీ తెలియకుండా దహనం చేద్దాం." సంగతి తెల్సిన చెల్వి ఖచ్చితంగా తన అభిప్రాయం వెలువర్చింది.

హాస్పిటల్ అధికారులతో మాట్లాడటానికి వెళ్ళాడు షాడో. పది నిముషాలలో పరిగెత్తుకుంటూ వచ్చాడు.

"పధారియా వచ్చాడు... బాలిక శరీరం తనకు కావాలని... హక్కుదారుడు తానేనని అంటున్నాడు" అని చెప్పాడు.

ఏం చేయాలో నాకు అర్థం కాలేదు. రాత్రి జరిగిన సంఘటనకు మూలకారకుడు పధారియా అనే నా అనుమానం. గొడవలేకుండా ఆమెను తీసుకోదలిచాడు. కుదరలేదు ఇప్పుడు పబ్లిక్‌గా బయపడ్డాడు.

ఇద్దరు నర్సులకు లంచం యిచ్చి కామ్‌గా బాలిక శవాన్ని కారులో పెట్టించాడు షాడో.

అధికారులను వప్పించి పధారియా అక్కడికి వచ్చేసరికి మా కారు కదిలింది.

పెద్దగా అరిచి కేకలు పెడుతున్న అతన్ని పట్టించుకోకుండా హాస్పిటల్ గేటులోనుంచి దూసుకుపోయాం.

పది నిముషాలుకూడా గడవక ముందే మా వెనుక నాలుగు పోలీస్ వాన్లు ప్రత్యక్షమయ్యాయి.

నాకు పట్టుదల హెచ్చింది. ఎలాగో మమ్మల్ని జైల్లో పెట్టించబోతున్నాడు పధారియా. బాలిక శరీరాన్ని అపహరించామని నేరం ఆరోపిస్తారు హాస్పిటల్ అధికారులు.

అతని బారినుంచి ఆ బాలికను రక్షించటానికి ఒకే ఒక మార్గం వుంది. ఆమె తిరిగి జాంబీగా జన్మ ఎత్తకూడదని అనుకుంటే ఒకే ఒక పని చేయాలి.

"రాజూ! నీ డాగర్ ఏమయింది?" అన్నాను.

అర్థంకాకపోయినా బూటులో వున్న డాగర్‌ని తీసి అందించాడు షాడో. చెల్విని కళ్ళుమూసుకోమని చెప్పాను.

"మిస్టర్ మాధవ్! యూ గోటు హెల్!" అన్నదామె.

ఇక చెప్పేదేముంది? ఆమె కళ్ళముందే డాగర్‌తో బాలిక మెడకోసి తలను మొండినుండి వేరు చేసేశాను.

ఫెయింట్ అయినంత పని చేసింది చెల్వి.

బిత్తరపోయాడు షాడో.

సీటుమీద పడిన ఆ బాలిక తల_నెమ్మదిగా కళ్ళు తెరిచి నా వంక చూసింది. ఆమె పెదవుల మీద అందమైన చిరునవ్వు ఒకటి మెరిసింది. “మీ ఋణం ఎలా తీర్చుకుంటానో తెలియదు... మీరు నా పాలిట దైవస్వరూపులు...” అంటూ కనులు మూసుకుంది. ఆమె తిరిగి బ్రతుకదు. ఆమెను జాంబీగా మార్చటం యిక ఎవరి తరమూ కాదు.

ఆ మాటలు విన్నారు షాడో, చెల్వి.

వారి ఆశ్చర్యానికి హద్దులేకపోయింది.

అదే సమయంలో మమ్మల్ని చుట్టుముట్టాయి. పోలీస్ వాన్లు. రెండు వాన్లు ముందుకు పోయి దారికి అడ్డంగా నిలబడ్డాడు.

కారును ఆపాడు షాడో.

“మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం... పీటర్స్ రక్షణలో వున్న బాలిక శవాన్ని చట్టవిరుద్ధంగా అపహరించటానికి ప్రయత్నించారు మీరు...”అంటూ కారులోకి తొంగి చూసిన పోలీస్ యిన్ స్పెక్టర్... తెల్లబోయి స్పృహ తప్పినంత పనిచేశాడు.

అతని వెనుకే వచ్చిన పధారియా... బాలిక వున్న తీరును చూసి హంతకులు_మంత్రగాళ్ళు...” అని అరుపులు ప్రారంభించాడు.

క్షణాలమీద మా చేతులకు బేడీలుపడ్డాయి. నిముషాల మీద జోడియా సెంటర్ జైల్లో ప్రవేశపెట్టబడ్డాయి.

మంత్ర తంత్రాలతో ప్రజలను భయపెట్టటానికి జోడియా వచ్చామని మా మీద నేరం ఆరోపించబడింది. అంతకు ముందుకు అక్కడికి వచ్చిన టూరిస్టులు అనేక మంది పిచ్చి వారైపోవటానికి కారకులు మేమేనన్న అనుమానం అధికారుల మనస్సులలో బలంగా నాటుకు పోయింది. అందుకు కారకుడు పధారియా, ఆ సంగతి తెలుస్తూనే వుంది.

సాయంత్రం నాలుగు గంటలకు మాకు తలకు రెండు ఎండురొట్టెలు ఒక గ్లాసుడు గంజి యిచ్చారు జైలుఅధికారులు.

పొద్దుటి నుంచి ఏమీ తినలేదు. ఆకలితో నకనకలాడుతున్నాం. అసహ్యం అనిపించినా, అవి తిన్నాం.

తిన్న మరుక్షణంనుంచీ మా కడుపులలో ఏదో అనీజీనెస్ బయలుదేరింది.

ప్లేట్లు తీసుకుపోవటానికి వచ్చిన సెంట్రీ భయంతో చూస్తూ వెళ్ళాడు నాకు డౌట్ వచ్చింది.

కొంపతీసి రొట్టెలో మందూ_ మాకులు కలపబడలేదుగదా!

ఆరుగంటల వేళకు జైలు అధికారులతోపాటు పధారియా కూడా మమ్మల్ని చూడటానికి వచ్చాడు.

"ఎవరు మీరు? జోడియా ప్రజలు మీకేం అపకారం చేశారని ఇక్కడ యిటువంటి పనులు ప్రారంభించారు" అని ప్రశ్నించాడు అధికారి.

అతను నాకు సమీపంలోకి రాబోతుండగా పధారియా చేయి అడ్డంపెట్టి వారించాడు.

అర్థం చేసుకున్నాడా అధికారి. వెంటనే గది బయటకు వెళ్ళి ద్వారం అవతల నిలబడి కోపంగా చూశాడు.

“సమాజానికి చీడపురుగులలాంటి వారు మీరు. ఆ విషయం రేపీపాటికల్లా తేల్చాస్తాం. చూడండి” అంటూ వెళ్ళిపోయాడు. అంత కోపంగా మాటాడినా నా సమీపంలోకి రావటానికి భయపడ్డాడతను.

బయట నిలబడి వెకిలిగా నవ్వాడు పధారియా.

“మాధవ్! ఇండియానుంచి నన్ను పట్టుకుందామని వచ్చారా. నా మంత్రశక్తులను ఎదిరించి, నన్ను నాశనం చేద్దామనా నీ అభిప్రాయం? నీలాంటి వారిని నంచుకుతింటాను నేను.” అన్నాడు.

చెల్వికి కోపం వచ్చినట్లుంది. విసురుగా సమాధానం యివ్వబోయింది. వారించాను అతనితో మాటలు పెంచుకోవటం అనవసరం.

“మిస్టర్ మాధవ్! నన్ను ఎదిరించిన వారికి ఎటువంటి గతి పడుతుందో _ చూశావ్ గదా! అప్పుడే ఏమయింది!! ముందున్నది ముసళ్ళ పండుగ జైలు వార్డెన్‌కి కనిపించకుండా” అంటూ, వెకిలిగా నవ్వుతూ వెళ్ళిపోయాడు పధారియా.

తలుపులుమూసి, తాళంవేసి, ఒకటికి రెండుసార్లు జాగ్రత్తగా పరీక్షించుకొని అవతలికి వెళ్ళి నిలబడ్డారు సెంట్రీలు.

“మధూ... పధారియాగాడు ఏమంటున్నాడు?” చిన్నగా అడిగాడు షాడో.

ఏమని సమాధానం యిస్తాను? పధారియా అన్న మాటలు నాకు కొరడా దెబ్బల్లా తగులుతున్నాయి. కడుపులో ఎవరో చేయిపెట్టి కదుపుతున్నట్లు నరాలు బిగదీసుకు పోతున్నాయి. గుండెలు బరువెక్కి ఊపిరి ఆడటం కష్టమైపోతోంది.

నా అనుమానం నిజమే అయింది. ఆ రొట్టెలలో విషం కలుపబడింది. అది పధారియా చేసిన పనే. ఏదో పెద్ద ప్రయత్నంమీదే వున్నాడు. అందుకే అన్నాడు ముందుది ముసళ్ళ పండుగ అని.

నా కళ్ళముందు_ పధారియా బంగ్లాలో తిరిగే జాంబీలు కదలాడారు. అప్రయత్నంగా నా శరీరం జలదరించినట్టు మాకు గూడా అదే గది పట్టదుకదా!!

కూర్చోవటానికికూడా ఓపికలేక తూలిపోతున్నది చెల్వి. రక్తంలేనట్లు తెల్లగా పాలిపోయి వుంది. ఆమె ముఖం. విపరీతంగా చెమటలు పోస్తున్నాయి.

"మధూ... మనం తిన్న రొట్టెల్లో విషం కలుపబడింది... మనల్ని చంపటానికి ఎవరో యీ ఘాతుకానికి వడిగట్టారు!" అన్నది హీనస్వరంతో.

నా కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. కష్టమంటే ఏమిటో తెలియని సుకుమారి _ నా మూలంగా ఎన్నిబాధలకు గురికావాల్సివచ్చింది!!

నా ఆలోచనలు ముఖంమీద ప్రతిఫలించాయి కాబోలు... కనిపెట్టేసింది చెల్వి. పాలిపోయిన ఆమె ముఖంలో చిన్న దరహాసం మెరిసింది.

"మధూ... నీతో నరకానికైనా సంతోషంగా వస్తాను. నా గురించి నువ్వు బాధపడకు. మనం వచ్చిన పని సానుకూలం అయ్యే మార్గం ఆలోచించు" అన్నది.

అప్పటికే ఆమె శక్తి చాలా భాగం హరించుకుపోయింది. మాటలు ముగించిన మరుక్షణం ఆమె తల పక్కకు వాలిపోయింది.

నమ్మలేక పోయాను. అసలు జరుగుతున్నదంతా కలేమో అన్న అనుమానంతో తొడగిల్లి చూసుకున్నాను. కలకాదు. యధార్థమే. నా కళ్ళముందే విషాహారానికి బలి అయిపోయింది చెల్వి.

"మధూ... నీకు సాయపడమని నన్ను పంపించాడు. సహాయం చేయలేకపోగా... నీ కాళ్ళకు అడ్డుపడుతున్నాను.

నేను నిస్సహాయుణ్ణి మధూ... నాశక్తికి మించిన వ్యవహారమైంది యిది..." అంటూ ముందుకు వాలిపోయాడు షాడో.

నేను చూస్తుండగానే షాడో శరీరం కట్టెలా బిగుసుకుపోయింది. పెద్దగా ఏడ్వాలని అనిపించింది నాకు. ఎటువంటి పరిస్థితినయినా ఎదుర్కోగల మేధావి షాడో. మృత్యువుతో పరిహాసాలు ఆడే మొనగాడు. ఏమీ చేయలేని స్థితిలో _ హీనమైన మరణం పొందాడు.

ఇందుకు కారకులు ఎవరు? పధారియా మాత్రం కాదు. అతన్ని ఎదిరించగలనన్న అతని నమ్మకంతో అక్కడికి వచ్చిన నేను _ నా వారి మరణానికి కారకుణ్ణి.

పధారియా శక్తి తెలిసిగూడా జాగ్రత్తపడకుండా సంచరించిన నేను... వారి గొంతులు కోశాను.

విషాహారం... నన్ను కూడా వివశుణ్ణి చేయటం ప్రారంభించింది. మేమున్న జైలు గది గిర్రున తిరుగుతున్నట్లు అనిపించసాగింది.

నాకు గూడా అంత్యకాలం ఆసన్నమయినట్లు గ్రహించగలిగాను. పధారియా గెలిచాడు. రేపు మా శరీరాలను జోడియా స్మశానంలో పాతిపెడతారు

ప్రభుత్వాధికారులు. రేపు రాత్రికి సపరివార సమేతంగావచ్చి పధారియా మమ్మల్ని జాంబీలుగా మారుస్తాడు.

ఆ మాట అనుకోగానే ఆవేశం నా నరనరాలకూ వ్యాపించింది. ఏమైనాసరే అలా జరగటానికి వీలులేదు... ఏమయినా సరే_

కృశిక మహర్షి అనే మహాతపస్వి మళయాళ మహా భగవతిని ఆరాధించి, ఉపాసించాడు. తన అనుభవాలు... ఆ మహాశక్తికి సంబంధించిన మంత్రాలు ఒక తామ్రపత్రం మీద లిఖించి సమయపుర కాళికాలయంలో భద్రపరిచాను.

పురాతన దేవనాగరిక లిపిలోవున్న ఆ విషయాలు ఎవరికీ అర్థంకావు. అదే పనిగా పెట్టుకున్న నేను... ఆ భాషను అభ్యసించి ఆ విషయాలు తెలుసుకున్నాను. నలభై రెండు పదాలతో... ఏడు బీజాక్షరాల చేరికతో కూడుకున్న మళయాళ మహాభగవతి మూలమంత్రాన్ని మూడుసార్లు జపించాను.

జ్యోతిర్మయ చక్రపు రక్షణ లేకుండానే దేహాన్ని వదిలి అంతరిక్షంలోకి ఎగిరింది నా ఆత్మ.

నా ఆలోచన ఒక్కటే. పధారియా మమ్మల్ని జాంబీలుగా మార్చటానికే ఆ ఎత్తుఎత్తాడు. మనిషి మరణించిన తరువాత కొద్దికాలం అతని ఆత్మ శరీరం దరిదాపులలోనే తచ్చట్లాడుతుంది. అందులోనూ ఇటువంటు మంత్రతంత్రాల వ్యవహారంలోపడి మరణించిన వారి ఆత్మలు... చాలాకాలం భువిమీదే వుంటాయి. ఆ ఆత్మలను ఆకర్షించి అంధకార శక్తులకు అర్పించి, శరీరాలకు ప్రాణం పోస్తాడు_ పధారియా.

చెల్వి షాడోలు జాంబీలుగా మారతారు. కాని నా శరీరాన్ని జాంబీగా మార్చాలంటే ముందు నా ఆత్మను అతను వశపరుచుకోవాలి. నా అంతట నేనుగా అంతరిక్షంలో సంచరిస్తున్నాను గనుక... అతని ప్రయత్నాలకు ఆటంకం కలిగించవచ్చు. వీలైతే అతన్ని నాశనం చేయొచ్చు.

నేను తెలుసుకున్న విషయాలన్నిటినీ మననం చేసుకుంటూ, నేను నేర్చుకున్న మంత్రతంత్రాలను జ్ఞాపకం పరచుకుంటూ జైలు సమీపంలోనే సంచరించటం ప్రారంభించాను.

రాత్రి పన్నెండు గంటలకు జైలు ఆవరణలో సంచలనం కనిపించింది. వార్డెన్, సెంట్రీలు, జైలు డాక్టర్లు హడావుడిగా అటూ యిటూ పరుగులుతీయటం ప్రారంభించారు.

అంతకుముందు మమ్మల్ని బంధించిన పోలీసు అధికారులు వచ్చారు, వారితోపాటు పధారియాగూడా అరుగుదెంచాడు.

రెండుగంటల తరువాత_ బంధింపబడిన పరదేశీయులు విషం తిని ఆత్మహత్య చేసుకున్నారని నిర్ణయింపబడింది.

తెల్లవారక ముందే పదిమంది పోలీసులు మా శరీరాలను జోడియా స్మశానంలోకి తీసుకుపోయారు.

వారి వెనుకే వెళ్ళాను. నా కళ్ళముందే పెద్ద పెద్దగోతులు తీయబడ్డాయి. నేను చూస్తుండగానే చెల్వి. షాడోల శరీరాలు భూస్థాపితం చేయబడ్డాయి. ఆఖరికి నా దేహంకూడా గోతిలో పడింది.

స్మశానానికి దూరంగా_ ఒక చెట్టుకింద నిలబడివున్న పధారియాను నేను గమనించక పోలేదు. అతని ముఖం మీద మెరుస్తున్న విజయసూచకమైన దరహాసం నా శరీరాన్ని కంపరం ఎత్తిస్తూనే వుంది.

ఆవేశపడి ఆ సమయంలో నేను చేయగలిగింది ఏమీలేదు. కలిసివచ్చే కాలం కోసం ఎదురుచూస్తూ, స్మశానంలో వున్న ఒక చెట్టుమీద విశ్రమించాను.

***

మరునాడు రాత్రి పన్నెండు గంటలకు పదిమంది అనుచరులతో స్మశానానికి వచ్చాడు పధారియా.

కర్రలు, కత్తులు పట్టుకున్న మరో పదిమంది అనుచరులు_ అటువైపు ఎవరూ రాకుండా స్మశానపు సరి హద్దుల్లో కాపలా నిలబడ్డారు.

మా శరీరాలను పాతిపెట్టిన స్థలంలో తను తెచ్చిన సరంజామాను దింపించాడు పధారియా. ఆ ప్రదేశమంతా శుభ్రంగా చిమ్మింది సున్నంతో ఏవేవో ముగ్గులు వేశాడు. ముగ్గుల మధ్య ఎముకలు, పుర్రెలు అమర్చి, రక్తజ్యోతులను వెలిగించాడు.

ఒక కుంపటిలో నిప్పు రాజేసి గుగ్గిలపు ధూపంవేస్తూ ఏవో నోరు తిరగని పదాలను ఉచ్చరించటం ప్రారంభించాడు.

జరుగుతున్న తతంగమంతా నేను ఆసక్తిగా గమనిస్తూనే వున్నాను దగ్గిరికిపోయి చూడాలని అనిపించింది. కాని... అంధకార శక్తులను ఆవాహన చేస్తున్నాడతను. ఆ సమయంలో నా వునికిని పసిగడితే... కొంపలు అంటుకుంటాయి.

అరగంటవరకూ ఎటువంటి సంఘటన ఎదురుకాలేదు. పధారియా ఉచ్ఛరిస్తున్న మంత్రాలజోరు హెచ్చించబడింది. గుగ్గిలపు పొగలు నలుపు రంగుకు తిరిగాయి... భరించరాని దుర్వాసన ఆ ప్రదేశమంతా ఆక్రమించుకున్నది.

మంత్రోచ్చాటన ఆపి అనుచరులకు సైగచేశాడు. పధారియా.

వెంట తీసుకువచ్చిన పలుగులు పారలు వుపయోగించి, మట్టి గుట్టలను తవ్వారు వారందరూ. పది నిముషాలలో మా శరీరాలు బయటికి వచ్చాయి.

ప్రశాంతంగా నిద్రపోతున్నట్లు కనిపిస్తున్నాయి. చెల్వి, షాడోలను చూడగానే నా గుండెల్లో మూడుమూరల పొడుగున్న వాడికత్తులు దిగబడినట్లు బాధతో మెలితిరిగిపోయాను నేను.

బొగ్గుల కుంపటిలో... మరింత గుగ్గిలంవేసి పెద్దపెట్టున అరవటం ప్రారంభించాడు పధారియా.

ఇద్దరు అనుచరులు... వెంట తెచ్చిన గోనెసంచుల ముడులు విప్పారు. రెండు పందులు_ నాలుగు కోళ్ళు_ బయటికి వచ్చాయి.

అవి ముగ్గుల మధ్యకు రాగానే పెద్ద కత్తితో వాటి మెడలు తెగనరికాడు పధారియా.

వాటి గుండెలు చీల్చి... రక్తాన్ని దోసిళ్ళతో బొగ్గుల మీద చిలకరించాడు.

నా చుట్టూవున్న వాతావరణమంతా ఎలక్ట్రిసిటీతో నిండిపోయినట్లు అనిపించి_ నాకు ఊపిరి ఆడటం కష్టమైపోయింది.

అంధకార శక్తులు... ఆవాహన గావించబడ్డాయి. అందుకనే నాకు అలా అనిపిస్తోంది.

మరో గోనెసంచి ముడి విప్పారు పథారియా అనుచరులు. కెవ్వుమన్న అరుపులతో ఆ ప్రదేశం దద్దరిల్లిపోయింది. అదిరిపడి చూశాను. కనిపించిన దృశ్యం_ నా నరాలను జివ్వుమనిపించింది.

పది నెలల వయస్సున్న పసికందులు ముగ్గుర్ని పథారియాకు అందిస్తున్నారు అతని అనుచరులు.

ఆత్మకు ఆత్మ బలికావటం అనేది భూమి పుట్టినప్పటి నుంచీ జరుగుతున్న వ్యవహారం. భూమిమీద ఒక జీవి జన్మిస్తే... అదే సమయంలో మరొక జీవి మరణించి తీరాలి. అది దైవనిర్ణయం.

దైవికమైన ఆ చర్యను అంధకార శక్తుల సాయంతో ఆచరిస్తున్నాడు పథారియా. మరణించిన మమ్మల్ని తిరిగి బ్రతికించటానికి మరో మూడు ప్రాణాలను బలి యిస్తున్నాడు.

ఏమీ చేయలేక నీరు నిండిన కళ్ళతో చూస్తూ నిలబడిపోయాను. ఏడ్చి గుక్కలు పడుతున్న ఆ నిర్భాగ్యశిశువులు ముగ్గురూ... పథారియా వాడి కత్తికి బలియైపోయారు.

మరుక్షణం భయంకరమైన నవ్వుతో ఆ ప్రదేశం ప్రతి ధ్వనించింది. బలిని స్వీకరించిన క్షుద్రశక్తులు... తృప్తిపొందాయి.

నిద్రనుంచి లేచిన వారిలా చెల్వి, షాడోలు లేచి నిలబడ్డారు.

వారి కళ్ళల్లో జీవంలేదు. ఆధునిక యుగంలో... శాస్త్రజ్ఞులు తయారుచేసిన యంత్రపు మనుష్యులకు వారికి తేడాలేదు.

పెద్ద చర్మపు కొరడాను గాలిలో విదిలించి పెద్దగా నవ్వాడు పథారియా.

“ఇక నుంచీ మీరు నా సేవకులు, నేనుచెప్పిన మాటల్ని మీరు అక్షరాలా అమలులో పెడతారు. మహామాంత్రిక శిరోమణి పధారియా బానిసలు మీరు.” అని అరిచాడు.

చెల్వి, షాడోలు సమాధానం యివ్వలేదు. అలాగే జీవంలేని చూపులు చూస్తూ నిలబడి పోయారు.

కొరడాతో వారిని కొడుతూ మరింత వికృతంగా నవ్వసాగాడు పధారియా. ఆ దెబ్బలు... చెల్వి షాడోలను యిసుమంతకూడా చలింపచేయటం లేదు. వారికి శారీరక జ్ఞానం నశించిపోయింది.

ఉన్నట్లుండీ పధారియా నవ్వు ఆగిపోయింది. కొరడాను అవతలికి విసిరి ముందుకు దూకాడు. షాడో, చెల్విలను పక్కకుతోసి నా శరీరం ముందు నిలబడ్డాడు.

“మాధవ్! చింతచచ్చినా పులుపు యింకా చావలేదన్న మాట! మరణం ఆసన్నం కాక ముందే ఆత్మస్వరూపంలో అంతరిక్షంలోకి పారిపోయావా! పిరికి పందా నిన్ను ఎలా ఆకర్షించాలో నాకు తెలుసు” అని అరుస్తున్నాడు.

సమాధానం యిస్తే ఏమౌతుందో నాకు తెలుసు. అందుకే నోరు మూసుకొని నిలబడిన చోటులోనే వుండిపోయాను.

కిందపడవేసిన కొరడాను అందుకున్నాడు పధారియా,

“మాధవ్! మర్యాదగా లొంగి పో... లేకపోతే నీ ప్రేయసి శరీరం ఏమౌతుందో చూచుకో...” బెదిరించాడు.

కళ్ళు మూసుకున్నాను నేను.

కొరడాతో చెల్విని హింసించటం ప్రారంభించాడు పధారియా. షాడోను కూడా బాది వదిలాడు. వారిద్దరి దుస్తులు చిరిగి పేలికలై పోయాయి వళ్ళు చురికలు పడి రక్తసిక్తమై పోయింది.

అయినా వారి పెదవులు కదల లేదు. నా గుండెలు కరుగలేదు.

"మాధవ్... నువ్వు యీ ప్రాంతాల్లోనే వున్నావ్... చూడు నిన్నేం చేస్తానో..." కోపంతో హుంకరించాడు పధారియా.

ఏం చేస్తాడో చూడటానికి సిద్ధపడ్డాను.

గీసిన ముగ్గుల మధ్యనే పడుకొని కనులు మూసుకున్నాడు. రెండు నిముషాలు కూడా గడవకముందే అతని ఆత్మ అంతరిక్షంలోకి వచ్చింది.

ఆ పైన నిగ్రహించుకోవటం నాకు చేత కాలేదు.

ఒక్క గంతులోపోయి మీద పడ్డాము ఆత్మస్వరూపంతో నేనున్న ప్రదేశాన్ని కనిపెట్టి ఏదో చెయ్యాలనుకొని వచ్చాడతను.

ఎదురు చూడని నా ఎటాక్ అతన్ని అదరకొట్టింది.

నా గుండెలు మండిపోతున్నాయి. అటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాను. పిడికిలి బిగించి నా బలమంతా వుపయోగించి గుద్దాను. పధారియా ఆత్మ ఎగిరి అల్లంత దూరంలో పడింది.

"పధారియా... రారా... పట్టుకోరా నన్ను..." అని అరుస్తూ మళ్ళీ అతని మీదికి లంఘించాను.

బెదిరిపోయాడు పధారియా... గిరుక్కున వెనుతిరిగి తన శరీరంలోకి వెళ్ళిపోయాడు. ఆత్మస్వరూపాన్ని వదిలి భౌతిక రూపాన్ని పొందాడు.

నిద్రలో పీడకల వచ్చిన వారు అదిరిపడి లేచినట్లు లేచి కూర్చున్నాడు ముగ్గుల మధ్య.

ఇకఆ ప్రదేశంలో వుండటం మంచిది కాదని నేను మళ్ళీ చెట్టు కిందికి పారిపోయాను.

ఆకాశంలోకి చూస్తూ పళ్ళు కొరికాడతను. రెండు నిముషాలు యోచించి తన అనుచరులతో ఏదో అన్నాడు.

వెంటనే సామాన్ల నన్నిటినీ గోనెసంచుల్లోకి సర్దారు వారందరూ, స్మశానం బయట ఆగివున్న వాన్ ఒకటి అక్కడికివచ్చింది చెల్వి, షాడోలను అందులోకి ఎక్కించారు. నా శరీరాన్ని ఒక స్ట్రెచ్చర్ మీద పడుకోబెట్టి ముందు సీట్ల మీద పడవేశారు.

తెల్లవారు ఝూమున నాలుగు గంటల వేళకు పధారియా బంగ్లా ముందు ఆగింది ఆ వాన్!

బంగ్లా అంతా అంధకార శక్తులకు ఆట పట్టులాంటిది. అందులో అడుగుపెట్టటానికి నాకు భయంవేసింది. అయినా తప్పదు. ఆ దుర్మార్గుడు ఏం చేయబోతున్నాడో తెలుసుకోవాలి. ముందే తెలుసుకొని అందుకు ప్రతి క్రియఆలోచించాలి.

వాన్‌లో వున్న చెల్వి షాడోలను కిందికి దింపి ఒక గదిలోకి నెట్టి తాళం వేశారు. బంగ్లాలో అండర్‌గ్రౌండ్ వుంది, అందులో పెద్ద గది ఒకటి చిత్ర విచిత్రమైన మంత్ర సాధనాలతో అలంకరించబడివుంది. అందులోకి వెళ్ళి తలుపులు మూసాడు పధారియా.

ఏదో పెద్ద ఎత్తుమీద వున్నాడని నాకు అర్థం అయింది. ధైర్యం చేసి గదిలోకి తొంగి చూశాను. గదికి ఒక చివర పెద్ద బీరువావుంది. అందులో పెద్ద పెద్ద పుస్తకాలు నీట్ గా బైండ్ చేసి వరుసల్లో పేర్చబడివున్నాయి.

ఒకదాని తరువాత ఒకటిగా వాటినన్నిటినీ పరిశీలిస్తున్నాడతను. నన్ను ఆకర్షించి నా శరీరాన్ని జాంబీగా మార్చే విధానం కోసం అన్వేషిస్తున్నాడు.

అతని బాధలకు అతన్ని వదిలి నేను బయటికివచ్చాను. అప్రయత్నంగా చెల్వి, షాడోలు వున్న గది వైపు పోయాను.

చూడటానికి ఏమున్నదని? వారిద్దరూ ప్రాణం వున్న రాతిబొమ్మలు కదిలే శక్తి తప్ప మరే విధమైన అనుభూతులు వారికి వుండవు.

పిచ్చిపట్టిన వాడిలా జోడియా పట్టణమంతా కలియతిరిగాను. ఎలాగైతేనేం తిరిగి చీకటి పడింది. ఎనిమిది గంటలుకొట్టే సమయానికి మళ్ళీ పధారియా భూతగృహానికి తిరిగి వచ్చాను.

అన్నీ సిద్ధంచేసుకొని తయారుగావున్నాడు పధారియా.

వింత వింత ముగ్గుల మధ్య పడుకోబెట్టి వుంది నా శరీరం పుర్రెలు ఎముకలు... బొగ్గుల కుంపట్లతో తయారైనాడు పధారియా.

నేను గదిలో ప్రవేశించే సమయంలోనే నన్ను వుద్దేశించి ఉపన్యాసాలు యిస్తున్నాడు.

“మాధవ్... నా శక్తి నీకు యింకా పూర్తిగా తెలిసిరాలేదు. ఆఖరుసారిగా హెచ్చరిస్తున్నా... మర్యాదగా లొంగిపో...”

మౌనంగా నిలబడ్డాను.

పళ్ళు కొరుకుతూ ఏవేవో మంత్రాలు చదివి _ రెండు కోళ్ళ గొంతులు కోశాడు. మరుక్షణం నన్నెవరో చెయ్యి పట్టుకొని లాగుతూన్నట్లనిపించింది.

అంధకార శక్తులు నన్ను బలవంతంగా నా శరీరంలో ప్రవేశ పెట్టాలని ప్రయత్నించసాగాయి.

వెంటనే జ్యోతిర్మయ స్వరూపాన్ని తలుచుకున్నాను. అటువంటి పరిస్థితుల్లో సామాన్యమైన ప్రార్థనలే ఫలితాన్ని యిస్తాయి. అనవసరంగా... పెద్ద పెద్ద మంత్రాలను వాడితే మేలుకు బదులు కీడు జరుగుతుంది.

జ్యోతిర్మయ స్వరూపపు ప్రార్థన నా మదిలో మెదలగానే అంధకార శక్తులు నన్ను వదిలి దూరంగా జరిగాయి.

మరో రెండు కోళ్ళను బలి యిచ్చాడు పధారియా. ఫలితం లేక పోయింది. గుక్క తిప్పుకోకుండా దేవీ స్తుతిపాఠాలు వల్లిస్తున్నాను నేను. ఆ వరస సామాన్యంగా కుదరదు. కుదిరిందంటే... యిక క్షుద్రశక్తులు నాదరిదాపులకు రాలేవు.

"మాధవ్... మంత్రాలతో రక్షణ కల్పించుకుంటున్నావా! అయితే చూడు... అంటూ బొగ్గుల కుంపటిలో నుంచి ఎర్రగా మెరిసిపోతున్న నిప్పు బగ్గును పటకారుతో బయటికి లాగాడు పధారియా.

నా దేవీ స్తుతి పాఠాలు... నా గొంతులోనే ఆగిపోయాయి.

నిప్పు బొగ్గును నా కుడికాలి బొటున వేలికి ఆనించాడతను. చర్మం కాలి కమురుకంపు గదినిండా వ్యాపించింది.

జీవంలేని ఆ కట్టెలో చలనం రాలేదు. భయంతో నా గుండెలు అలిసిపోయాయి. ఆ దుర్మార్గుడు నా కాలును కాల్చి... నాశనం చేయబోతున్నాడు. ఒకవేళ నేను తిరిగి ఆ దేహంలో ప్రవేశించటం అంటూ జరిగితే ఆ బాధను అనుభవించి తీరాలి. కాలి బొబ్బలు ఎక్కితే ఫరవాలేదు.

కాని కాలుకుంటి అయిపోతే!! జీవితమంతా కుంటుగానే గడపాలి.

బొటన వేలుసగం కాలింది. అతి ప్రయత్నంమీద నన్ను నేను బిగపట్టుకొని దూరంగా జరిగి నిలబడ్డాను.

ఉన్నట్లుండి పటకారును నేలకేసి బాది గుండెలు బాదుకున్నాడు పధారియా. ఆవేశం అతని దేహమంతా వ్యాపించిపోయింది. కోపంతో అతని ముఖం ఎర్రబడి వికృతంగా తయారయింది.

అటూ యిటూ చూసి నా శరీరం తలవైపు మరికొన్ని ముగ్గులు గీశాడు. వాటిలో ముంగిస, పిల్లి, ఎలుక, పాము పుర్రెలను నిలబెట్టి_కోడి రక్తంకలిపిన నూనెతో జ్యోతులు ప్రతిష్ఠించాడు.

బట్టలు వూడతీసి నగ్నంగా ఆ ముగ్గుర మధ్య కూర్చుని వికృత కంఠంతో దాఋణ శబ్దాలు కల మంత్రాలు చదవటం ప్రారంభించాడు.

రెండే రెండు నిముషాలు విన్నాను ఆ మంత్రాలను ఆ రెండు నిముషాలు చాలని అనిపించింది.

ఎక్కడ లేని భయమూ నన్ను ఆవరించుకుంది. వెనుతిరిగి అతివేగంగా బయటికివచ్చి పడ్డాను.

పధారియా ఓటమిని అంగీకరించాడు. ఆఖరి సారిగా శక్తులన్నిటినీ ధారపోసి స్మశాన భైరవుణ్ని ఆవాహన చేస్తున్నాడు. క్షుద్రశక్తులకు రాజులాంటివాడు స్మశాన భైరవుడు. అతన్ని ఎదిరించి నిలబడే శక్తి నాకు లేదు. అటువంటి మంత్రాలుకూడా నాకు తెలియవు.

స్మశాన భైరవుడి బారినుంచి రక్షణ కల్పించుకోవాలి. కాంతినిమించిన వేగంతో భారతదేశంలోకి అడుగుపెట్టాను.

ఎటుపోవాలో అర్థం కావటంలేదు. ఎక్కడ దాక్కోవాలో నిర్ణయించుకోలేక పోతున్నాను.

వారణాసి వెళ్ళాను. కలకత్తా కాళీ మందిరంలోకి తొంగి చూశాను. రాజస్థాన్ వింధ్యవాసినీ ఆలయాన్ని సందర్శించాను. ఎన్ని ప్రదేశాలు చూసినా నా మనస్సుకు నెమ్మది చిక్కలేదు.

ఆఖరికి అటు తిరిగి యిటు తిరిగి నర్మదా నది వడ్డున వున్న ఒక పురాతన ఆంజనేయస్వామి ఆలయంలోకి ప్రవేశించాను.

క్రీస్తుకు పూర్వం రెండు వందల సంవత్సరాలముందు కట్టబడిందట అది. భారతదేశంలోని ఆలయాలన్నిటికంటె అతి ప్రాచీనమైనదని అంటారు.

పది అడుగుల ఎత్తున వున్నది. స్వామి విగ్రహం. సింధగారం పులుముకొని వెండిగద చేతపట్టుకొని మహాకోపంగా చూస్తున్నాడు వీరాంజనేయ స్వామి.

స్వామి పాదాలను కౌగలించుకొని, ఆంజనేయ స్తుతి పాఠాలు చదువుకుంటూ, ప్రాణాలు అరిచేతుల్లో పెట్టుకొని కూర్చున్నాను.

అంతా నిశ్శబ్దంగావుంది. విగ్రహం ముందున్న జ్యోతి గాలికి అల్లల్లాడుతున్నది. దూరంలో ఎక్కడో నక్క ఒకటి హృదయ విదారకంగా కూతబెడుతున్నది.

స్వామి పాదాల మీదే చూపులు నిలిపివున్న నా భుజం మీద బరువైన చేయి ఒకటి పడింది.

అదిరిపడి ఆంజనేయ దండం వల్లించటం ఆపాను. మరుక్షణం ఎవరో నన్ను ఎత్తి ఆలయం బయటికి విసిరారు.

తల్లక్రిందులుగాపోయి ధ్వజస్థంభానికి గుద్దుకొని కిందపడ్డాను. నాకు ఏమీ అర్థం కావటంలేదు. అంతా అయోమయంగా అనిపించసాగింది.

"మాధవా... నావైపు చూడు" వినిపించింది అదే సమయంలో ఒక గంభీర కంఠం.

***

క్షుద్ర శక్తులను గురించి నేను చదివిన పుస్తకాలన్నిటిలోనూ ఒక విషయం నొక్కి నొక్కి చెప్పబడివుంది.

వాటికి ఆకర్షణ శక్తి అధికం. వాటి కళ్ళల్లోకి చూసినా వాటి మాటలను అదే పనిగా విన్నా_ ముప్పుతప్పదు. ఎటువంటి మంత్రవేత్త అయినా సరే వాటి ఆకర్షణ శక్తికి లొంగిపోతాడు.

"మాధవా! ఎందుకలా భయపడతావ్? నిన్నేమీ చేయను. నావైపు చూడు" మరోసారి మృదువుగా అన్నదా గంభీర కంఠం.

భయం నన్ను పిచ్చివాణ్ని చేసింది “స్వామియే శరణం. శరణు శరణు అని అరుస్తూ ఆలయంలోకి పరుగెత్తపోయాను.

చటుక్కున నా దారికి అడ్డం వచ్చిందొక చెయ్యి. నల్లగా నిగ నిగలాడుతున్నది. బంగారు కంకణాలతో అలంకరించబడి వుంది.

దైవ సంబంధమైన లోహం బంగారం. క్షుద్రశక్తులు బంగారుతో చేయబడిన ఆభరణాలు ధరించవు.

ఆ సమయంలో నాకు ఆలోచన రాలేదు. పంచముఖ ఆంజనేయ స్వామిని మనసారా తలచుకొని ఎగిరి ఆ చేతిని తన్నాను.

చేయి పక్కకు తొలిగింది. వెంటనే గర్భ గుడిలోకి పరుగెత్తి స్వామి మెడను కౌగలించుకొని వేలాడబడ్డాను.

“మాధవా! ఆలోచించకుండా ఆవేశ పడుతున్నావ్. నా వైపు చూడవయ్యా! నీకు కీడుచేయటానికి రాలేదు. నేను.” అంటూ గర్భగుడి బయటినుంచి వినిపించింది ఆ కంఠం.

ఈసారి కొద్దిగా తలఎత్తి చూశాను. కళ్ళముందు పదివేల కాండిల్స్ పవర్ గల ఫ్లెడ్ లైట్లు మెరిసినట్లు నా కళ్ళు జిగేల్ మన్నాయి.

ఆ కాంతి పుంజాల మధ్య నల్లటి రూపంగల యువకుడొకడు నిలబడి వున్నాడు.

పురుషులలో అంత అందమైన వారుంటారని నేను అనుకోలేదు. ఆ పెద్ద మనిషి ఒక్కసారి మద్రాస్ మౌంట్ రోడ్డుమీద అలా అలా షికారుకువస్తే_ మద్రాసులో వున్న ఆడవాళ్ళు యిళ్ళల్లో వుండరేమో అన్న అనుమానం కలిగింది.

అతని ముఖం మీద మెరుస్తున్న చిరునవ్వు అతని అందాన్ని మరింత ఎత్తి చూపిస్తున్నది.

“మాధవా... ఎందరో మాంత్రికులను చూడటం యిదే ప్రథమం... ” అన్నాడు యువకుడు.

“మరేం ఫరవాలేదు. నన్ను వదిలిపెట్టి పోనాయనా... నా బాధ నీకెలా అర్థం అవుతుంది? ” అని అందామని అనుకున్నాను గాని అనలేదు.

“ఈ గోల ఎలా ప్రారంభమయింది మాధవా? మంత్ర తంత్రాల వాడుక యీ కలియుగంలో నిషేధించబడిందని మీకు తెలియదు?” మృదువుగా ప్రశ్నించాడు యువకుడు.

ఆ మాటలతో నా భయం కొంతవరకూ వుపశమించింది. స్వామి మెడనే వదిలి కిందికి దిగి ప్రాణాల ముందు కూర్చున్నాను. కులకర్ణిగారు నాకు జాబు వ్రాసిన దగ్గిర నుంచీ జరిగిన కథ అంతా వివరంగా విప్పిచెప్పాను.

ఓపికగా విని సాలోచనగా తలవూపాడు ఆ యువకుడు.

“మాధవా... అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే వుపయోగించ బోతున్నారా మీ ప్రభుత్వాధినేతలు?”

నిజంగా. ఆ ప్రశ్నకు సమాధానం ఏమన్నావుంటే అతనికే తెలియాలి. భవిష్యత్ లోకి చూసే శక్తి నాకులేదు. వుంటే యీ ఎస్సైన్‌మెంట్‌ని ఎందుకు నెత్తిమీద వేసుకునేవాణ్ణి?

“మాధవా భారత దేశపు ఆకాంక్ష సమర్ధనీయమైనదే అని అనిపిస్తోంది. నీకు సాయపడతాను. కాని అందుకు ముందు నువ్వు నాకోరిక ఒకటి తీర్చాలి.” అన్నాడు యువకుడు.

“ఏమిటది?” అప్రయత్నంగా అడిగాను.

“ఆత్మ స్వరూపంలోవుండి నువ్వు పధారియా శక్తుల్ని లెక్క చేయలేదు. అందుకు అతను స్మశాన భైరవుణ్ని ఆవాహన చేశాడు తన స్థానాన్ని వదిలి యివతలకు వచ్చిన స్మశానభైరవుడు_ పిలిచిన వారి కోరికను తీర్చందే తిరిగిపోడు. అందువలన నువ్వు ఒక్కసారి పధారియా ముందు నిలబడి అతని మాటలు వినాలి.”

ఆ మాట విన్న మరుక్షణం ఎగిరి మళ్ళీ ఆంజనేయ స్వామి మెడను కౌగలించుకున్నాను. కంచు గంటలా మోగుతున్న కంఠంతో బిగ్గరగా పంచముఖ ఆంజనేయ స్వామి మూల మంత్రాలను జపించటం ప్రారంభించాను.

ఆ యువకుడు ఎవరో నాకు అర్థమైపోయింది. నన్ను ఏమార్చి అక్కడి నుంచి తీసుకుపోవాలని వచ్చిన స్మశాన భైరవుడు.

ఆంజనేయస్వామి సన్నిధిలో తన శక్తుల్ని ప్రదర్శించటానికి భయపడి మాయోపాయాలను ఆశ్రయిస్తున్నాడు.

“చెవి కోసిన మేకలాగా అలా గొంతు చించుకుంటావెందుకు మాథవా? నేను క్షుద్రశక్తిని కాదు. స్మశాన భైరవుడు అన్న పేరు విని నన్ను అపార్థం చేసుకుంటున్నారందరూ. పరంజ్యోతి ఆదేశం వల్ల నా స్థావరం రుద్రభూమి

అయింది. అంత మాత్రం చేత నేను అంధకార శక్తులకు చెందిన వాడినని అపోహపడకు.''

ఒక్కక్షణం మంత్ర పఠనం ఆపి, ''యీ సకల చరాచర ప్రపంచాన్ని సృష్టించిన జ్యోతిర్మయ స్వరూపం మీద ఆన... మర్యాదగా నన్ను వదలి పోతావా? లేక ఆత్మత్యాగం చేసుకొని నీ అంతు చూడమంటావా?'' అని అరిచాను.

ఆ మాట వినేసరికి అదిరిపడి ఆలయం బయటికి వెళ్ళి పోయాడా యువకుడు.

''మధూ... నా మాట వినవయ్యా... జ్యోతిర్మయ స్వరూపం మీద ప్రమాణం చేసి చెపుతున్నాను. నీకు ఎటువంటి ప్రమాదమూ సంభవించదు నాతో వచ్చి ఒక్కసారి పధారియా మాటలు విను. నువ్వు ఆరాధించే దైవికశక్తుల బంటును. నేను చేతగానివాణ్ణి అనే పేరు తెచ్చుకోవటం నీకు బాగుంటుందా?'' బ్రతిమాలటం ప్రారంభించాడు.

క్షుద్రశక్తులు అరిచి పీక్కున్నా అలాంటి ప్రమాణాలు చేయవు. చేయలేవు. అందువల్ల నాకు ధైర్యం వచ్చింది.

రక్షణ యిచ్చి, నా ప్రాణాలు కాపాడిన స్వామికి సాష్టాంగనమస్కారం చేసి బయటికి వచ్చాను.

సంతోషంలో ఆ యువకుడి ముఖం విప్పారింది. నా చేయి పట్టుకొని ఆకసంలోకి ఎగిరాడు. కన్నుమూసి కన్ను తెరిచేటంతలో పధారియా హోమం చేస్తున్న గదిలోకి వెళ్ళాం యిద్దరమూ.

తదేక ధ్యానంతో మంత్ర పఠనం కొనసాగిస్తున్నాడు బొగ్గుల కుంపటిలోని బొగ్గులు రక్తజ్యోతుల్లా కణకణలాడుతున్నాయి.

"మాధవా... నిన్ను నీ శరీరంలోకి ప్రవేశపెట్టటంతో నా కర్తవ్యం ముగుస్తుంది. పధారియాతో మాట్లాడి అన్ని విషయాలు సరిచేస్తాను. నువ్వు కొద్దిసేపు నీ శరీరంలోకి వెళ్ళు." అన్నాడు యువకుడు నాతో.

అనుమానంగానే వుంది. అయినా స్మశాన భైరవుని అంతటివాడు వచ్చి ప్రాదేయపడుతుంటే కాదని ఎలా అనగలను?

గుబ గుబలాడుతున్న గుండెలతో నా దేహంలోకి ప్రవేశించాను. మరుక్షణం భయంకరమైన నవ్వు నా కర్ణరంధ్రాలను చిల్లులుపడవేసింది.

అదిరిపడి బయటికి రాబోయాను. ఆ పని అసాధ్యం అయిపోయింది. స్మశాన భైరవుడు నన్ను మోసంచేశాడు. నా శరీరంలోకి పంపి నా ఆత్మను బందీచేశాడు.

"మాధవా... దైవిక శక్తుల అండవుందని మిడిసి పడ్డావా? చూడు నీ గతి ఏమయిందో!" అంటూ మాయమైపోయాడు యువకుడు.

***

జరుగరాని అనర్థకమే జరిగిపోయింది. అందుకు వగచి ప్రయోజనంలేదు. పధారియా యింకా మంత్రాలు చదవటంలోనే నిమగ్నుడైవున్నాడు. అతను జరిగిన విషయాన్ని గమనించేలోగా ఆ చిక్కునుంచి బయటపడాలి.

భయంతో బిగుసుకుపోతున్న మెదడును స్వాధీన పరుచుకుంటూ ఆలోచించటం ప్రారంభించాను.

కాని, నాకు తెలియకుండానే చిన్న తప్పు జరిగిపోయింది. పధారియాకు నా వునికి తెలిసిపోయింది.

అంతకు ముందుకు నన్ను శరీరంలోకి ఆకర్షించలేక పోయానన్న కక్షతో నా కుడికాలి బొటనవేలితో నిప్పులతో కాల్చివున్నాడు. నేను దేహంలోకి ప్రవేశించగానే భౌతికమైన ఆ బాధ నన్ను ఖంగారు పెట్టేసింది. అప్రయత్నంగా కుడికాలు కొద్దిగా చలించింది.

ఆ కదలిక పధారియా కళ్ళ పడింది.

“దొరికావ్ రా మాధవా! యిక నీ గతి కుక్కలు నక్కలు గూడా చూడవ్” అంటూ ముగ్గులలోనుంచి లేచాడు.

హడావుడిగా లేచాడు. ఆ హడావుడిలో ముగ్గులమధ్య నిలబెట్టివున్న పుర్రె ఒకటి అతని కాలు తగిలి పక్కకు దొర్లిపోయింది. ఒక రక్త జ్యోతి ఆరిపోయింది.

మరుక్షణం నన్ను కదలకుండా బిగించి పట్టివున్న శక్తి బలహీనమైపోయింది.

మంత్రోచ్చాటన మధ్యలో విరమించకూడదు. నెంబర్ వన్ తప్పది. శ్మశాన భైరవునిలాంటి మహాశక్తులను ఆవాహనచేసే యంత్రాల విషయంలో చాలా జాగ్రత్తగా వుండాలి. నెంబర్ టూ విషయమిది.

ఈ రెండు విషయాలుమర్చిపోయాడు పధారియా.

నన్ను పట్టిన శక్తి బలహీనమైపోగానే చివాలున గాలిలోకి లేచాను.

తంతు బెడిసి కొట్టటంవల్ల పధారియా కంపించిపోయారు. అతని నవ రంధ్రాల నుంచి రక్తం వరదలుగా కారసాగింది.

అయినా అంత తేలికగా అతని ప్రాణాలు పోవు. పోతాయని నేను ఆశించనూలేదు.

ఆ ప్రదేశంనుంచి బయటపడి యింకేదైనా మార్గం ఆలోచిద్దామని అనుకుంటూ వుండగా, మళ్ళీ నా ముందు ప్రత్యక్షమయ్యాడు నన్ను మోసగించిన యువకుడు.

నాకు కోపంవచ్చింది. భయంవేసింది అతనికీ నాకు వున్న మధ్య దూరాన్ని కనులతోనే అంచనా వేశాను. పిడికిళ్ళు బిగిస్తూ.

"మాధవా! నువ్వు దురుసు వాడివనే అనుకున్నాను. మంత్రశక్తుల్ని భుజబలంతో ఎదిరించే ఆలోచన చేస్తున్నావా మూర్ఖుడా!" అని వికటంగా నవ్వాడా యువకుడు.

కోపంతో నాకళ్ళు పచ్చబడ్డాయి. ఏం మాట్లాడుతున్నావో, ఏం చేస్తున్నానో నాకే అర్థం కాకుండాపోయింది. అంతవరకూ నా ప్రాణాలు కాపాడుకొని, తద్వారా చెల్వి, షాడోలను రక్షించుకొని, ఆ పైన నేను మొదలుపెట్టిన పనిని పూర్తిచేసి నా దేశానికి సేవ చెయ్యాలని ఆశించాను. అవి జరిగే పనులలాగా కనిపించటంలేదు. ఇక నేను ప్రాణాలు దక్కించుకోవటంలో అర్థం ఏముంది? షాడో లాంటి స్నేహితుడు, చెల్విలాంటి ప్రేయసి నాకు వెయ్యి జన్మలు ఎత్తినా లభ్యమౌతారా?

"మిస్టర్! నువ్వు మంత్రశక్తివే కావచ్చు. నీ ముందు నేను గడ్డిపరకనే కావచ్చు. కాని సమయం వచ్చింది. పఠారియాను ఎదిరించే ప్రయత్నం నేను నా స్వార్థం కోసం చేయలేదు. నా దేశాన్ని నా ప్రజలను రక్షించుకోవాలని యీ రొంపిలోకి దిగాను. శాంతి కాముకులైన నా ప్రజల ఆశీస్సులు నాకు వున్నాయి.

ప్రపంచంలో శాంతి సుస్థిరంగా నిలవాలని భగవంతుణ్ణి ప్రార్థించేవారి పార్థనలు యీ సమయంలో నాకు రక్షణ కల్పిస్తాయి. ఇప్పుడు నేను దిక్కూ మొక్కూ లేని ఒక ఆత్మ స్వరూపినికాదు. నీలాంటి శక్తుల్ని హత మార్చగల ప్రజాశక్తిని. చూడు... నా బలం రుచి చూసి నా మాటలు యదార్థాలలో, కాదో, సంకోచాలు పక్కకు నెట్టి అతనిమీద కలబడ్డాను.

మరుక్షణం నా కళ్ళముందు మెరుపులు మెరిశాయి. తల్లకిందులుగా వ్రేలాడబడిపోయాను నేను.

యువకుడి స్థానంలో శ్మశాన భైరవుడు తన విశ్వరూపంతో ప్రత్యక్షమయ్యాడు.

ఆ రూపాన్ని చూడటం నాకు అసాధ్యమైపోయింది. నా కళ్ళు మూతలుపడ్డాయి. అయినా చూసిన ఒకలిప్తకాలం చాలు నా జీవితమంతా గుర్తు వుంటుంది ఆ క్షణం.

"మాధవా! నీ దేశభక్తికి సంతోషించాను. నా వంక చూడు." అన్నాడు శ్మశాన భైరవుడు.

నేను తలవంచుకునే నిలబడిపోయాను.

"మాధవా! దైవభక్తి సన్నగిల్లుతున్న యీ కలియుగంలో, నీలాంటి వారు జన్మించటం చాలా అరుదు. మంచిని నమ్మటమే. నలుగురూ నాలుగు నాళ్ళు హాయిగా జీవించాలని కోరుకోవటమే దైవత్వానికి చిహ్నమని మరిచిపోతున్నారు మానవులు. అర్థంలేని శత్రుత్వాలతో స్వార్థానికి లోబడి తమ వినాశనాన్ని తామే కొని తెచ్చుకుంటున్నారు. నీ దేశంకోసం యింతటి సాహసానికి పూనుకున్నావ్

దైవాన్నే ఎదిరించటానికి సిద్దపడ్డావ్ నాకు చాలా సంతోషమయింది. ఏం కావాలో కోరుకో.

ఏం కోరుకోవాలో నాకు తోచలేదు. తలవంచుకొని క్రిందికి చూశాను.

పథారియాకు యీ విషయాలు వినిపించవ్ అతను తన గొడవలో తానున్నాడు ఆవేశంలో ముందూ వెనుకా ఆలోచించకుండా శ్మశాన భైరవుణ్ణి రెండవసారి ఆవాహన చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు.

అది చాలా తప్పు, శ్మశాన భైరవుణ్ణేకాదు, మంత్ర తంత్రాలలోదేన్నైనా సరే... ఒకే రాత్రి రెండుసార్లు ప్రయోగించకూడదు అలా చేయాలంటే సామాన్యశక్తులు చాలవు. మహాశక్తివుంతుడై వుండాలి.

“మాధవా! ఆలోచిస్తున్నావేం? ఏం కావాలో కోరుకో!” శ్మశాన భైరవుడి చెయ్యి నా భుజంమీద పడింది.

ఆ చేతికి వున్న కంకణాల వెలుగునే చూడటం కష్టం అయిపోయింది. మానవులకు దేవుడు ప్రత్యక్షం కాని కారణం ఏమిటో నాకు ఆ సమయంలో అర్థం అయింది. ఆ తేజస్వరూపాన్ని చూసి తట్టుకునే శక్తి యీ పందొమ్మిది వందల ఎనభై ఏడులో ఎవరికీలేదు.

“పథారియా అంతు చూడాలని వచ్చాను ఆ పని పూర్తి అయితే నా బాధ్యత నెరవేరుతుంది.” అన్నాను లోగొంతుకతో.

“పథారియాను చంపమంటావా?”

“అంత పని దేనికి! నాకు కనిపించిన రూపంతోనే అతనికీ కనిపించండి. అది చాలు”

మరుక్షణం అదే రూపంలో ముగ్గులమధ్య ప్రత్యక్షమయ్యాడు శ్మశాన భైరవుడు.

"పథారియా! పిలిచావ్ గదా! వచ్చాను చూడు." అన్నాడు. చేతులతో కళ్ళు మూసుకుని వేళ్ళ సందుల్లో నుంచి కొద్దిగా చూశాడు. కనిపించిన ఆ కొద్దిరూపమే అతని రక్తాన్ని చల్ల బరిచేసింది.

ఎర్రటి మంటలు వెదజల్లుతున్న కళ్ళు, తెల్లటి కోరలు బయటికి పొడుచుకు వచ్చిన నోరు, నీలి రంగు నాలుక, పాముల లాంటి జాడలు కట్టిన జుట్టు, ఆకు పచ్చరంగు పట్టు వస్త్రాలు, నల్లటి దేహం_ నిట్టనిలువుగా ప్రత్యక్షమైన శ్మశాన భైరవుణ్ణి చూసి కెవ్వున అరిచాడు పథారియా.

ముగ్గుల్లోనుంచి బయటపడి అటూ యిటూ పరుగులు తీశాడు. "వద్దు... వద్దు... నాకు కనిపించద్దు... నన్ను వదులు... నన్ను వదిలి వెళ్ళిపో..." అని అరుస్తూ ఆ గదినుంచి బయటపడాలని ప్రయత్నించాడు. అతని ప్రయత్నం ఫలించలేదు.

తేజోస్వరూపాన్ని సూటిగా చూడటంతో అతని కనుపాపలు మాడిపోయాయి. భయంకరమైన ఆ ఆకృతిని చూడటంతో అతని మతి చలించింది.

వికటంగా నవ్వుతూ, వికృతంగా అరుస్తూ గోళ్ళతో తనకు తనే తన శరీరాన్ని బరుక్కున్నాడు. జుట్టు పీక్కున్నాడు. ఆఖరికి తల నేలకేసి బాదుకొని ప్రాణాలు తీసుకున్నాడు.

మమ్మల్ని ఆ గదికితీసుకువచ్చిన మంత్రిక వేత్త పధారియా హత మారిపోయాడు.

“మాధవా! మొదటిసారి గనుక నీ దురుసుతనాన్ని క్షమిస్తున్నాను. ఇక యిటువంటి వ్యవహారాల్లో తలదూరిస్తే_ నీకు కీడు జరుగుతుంది. నీ వారితో నీ దేశం పోయి జరిగినదంతా ఒక కలగా భావించి మర్చిపో. యీ విషయాలు బయటికి వెల్లడించావంటే మాత్రం బాగోదు.” అంటూ మాయమైపోయాడు శ్మశాన భైరవుడు.

అంత భయంలోనూ నాకు నవ్వు వచ్చింది. ఈ విషయాలు బయటికి వెల్లడించినా నమ్మేది ఎవడు? ఈ అణుయుగంలో మంత్రాలా? శ్మశాన భైరవులా? నాన్సెన్స్... వీడెవడో కీల్పాక్ మెంటల్ హాస్పిటల్ నుంచి పారిపోయి వచ్చినట్లున్నాడు. పట్టుకోండయ్యా, పట్టుకోండి! అంటూ చందాలు వేసుకొని నా వెంట పడతారు భారతీయ పౌరులు.

నా ఆలోచనలనుంచి నేను బయట పడనేలేదు. ఎవరో నన్ను పట్టుకొని గాలిలోకి విసిరారు. ఆత్మస్వరూపినైనా నాకు ఆ వేగం భయాన్ని కలిగించింది.

క్షణం తర్వాత ఒక చెట్లతోపుమధ్య పడ్డాను. తల పక్కకు తిప్పేసరికి నా పక్కనే పడివున్న చెల్వి షాడోలు కనిపించారు.

అప్పుడే కనులు విప్పింది చెల్వి. నన్ను చూడగానే “మధూ_ అబ్బ! ఎంత భయంకరమైన కల!!” అంటూ లేచి కూర్చుంది.

“అవునమ్మా... అటువంటి కలే నాకూ వచ్చింది... ఏమిటి యీ విచిత్రం? అంటూ షాడోభాయ్ కూడా లేచాడు.

వారి మాటలు విన్న నాకు నిజంగానే జరిగినదంతా కలేమో అన్న అనుమానం వచ్చింది. చుట్టూ చూశాను. కనిపించిన దృశ్యం... నా మతి పోగొట్టింది.

కులకర్ణిగారి బంగ్లా వెనుకవున్న తోటలో వున్నాము మేము. సరిగ్గా జోడియా బయలుదేరేముందు ఏ చెట్లక్రింద కూర్చుని కబుర్లు చెప్పుకున్నామో, అవే చెట్లక్రింద వున్నాం యిప్పుడు కూడా! నిజంగానే కలకాదుగదా!!!"

***

"వెల్! వెల్!! వెల్!!!" సిగార్ పొగను గుప్పు గుప్పున వదులుతూ మూడుసార్లు అన్నారు కులకర్ణి.

"ఇంకోసారి అనండి. నవ్వుతూ నాలుగుసార్లు అన్నట్లు అవుతుంది" చటుక్కున అన్నిది చెల్వి.

ఆయనకు అర్థంకాలేదు.

"చచ్చీ చెడీ ఆ భయంకర దీవిలో ఏదో బాధపడి పని పూర్తి చేసుకువచ్చాడు మాధవ్. పూలదండలు వేసి మెచ్చుకోక పట్టి వెల్స్‌తో ముగిస్తున్నారు?" అన్నదామె.

బిగ్గరిగా నవ్వారు కులకర్ణి.

చెల్వికి యింకా తెలిసిరాలేదు. సి.ఐ.బి.కి చెందిన ఏజెంట్‌ని నేను. నేను చేసిన పనిని గూర్చి ఆయన ఒకసారి వెల్ అంటే _ ఏనుగు ఎక్కినంత సంబరం నాకు. మూడు సార్లు అంటే యిక చెప్పేదేముంది?

"ఏమ్మా చెల్వి... మమ్మల్ని మద్రాసు ఎప్పుడు రమ్మంటావ్?" మాట మార్చాడు షాడో.

"యిప్పుడే రండి... వద్దని నేను అనలేదుగా!"

"మద్రాసు రావటానికి నీ ఆహ్వానాలు అనవసరం. వచ్చిన తర్వాత విందు భోజనాలేమైనా వుంటే _ నువ్వు రమ్మని అనటం సబబుగా వుంటుంది" వూరికే కూర్చోలేని బిందు అందుకుంది.

"విందు భోజనాలేగా! ఓ... దండిగా పెట్టిస్తాను..." అంటూ నాలుక కరుచుకొని అక్కడినుంచి లేచి పారిపోయింది చెల్వి. వారి అభిప్రాయం అర్థం అయ్యేసరికి ఆమెకు ఎక్కడాలేని సిగ్గు ముంచుకు వచ్చింది.

"మాధవా! వెల్ డన్ మై బోయ్... మన పరువులు నిలబడ్డాయి..." నా భుజం తడుతూ ప్రశంశించారు కులకర్ణి.

వారందరి మాటలతో నేను పడిన కష్టం మరిచిపోయాను. టెర్రర్ ఐలండ్ లోని అనుభవాల లాంటివి జీవితంలో కొన్ని వుండటం చాలా అవసరం. ఇప్పుడే జీవితం నిత్య నూతనంగా వుంటుంది.

నా ఆలోచనల్లో నేనుండి... చెల్వి తిరిగి రావటం గమనించలేకపోయాను.

"ఏం మిస్టర్!! యింటికి పోదామా? యిక్కడే జీవితమంతా గడిపేద్దామా?" అన్నది నడుము చేతులు వుంచుకొని. ఆ పోజు నాకు చాలా యిష్టం. అంత అందాన్ని సృష్టించిన ఆ భగవంతుడు లేని పోని ఆమె కోపాన్ని ఎందుకు తగిలించాడో అని ఆలోచిస్తూ లేచి నిలబడ్డాను.

**శుభం**